Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



కడప KADAPA | సంపుటి : 03 | సంచిక : 37 | శుక్రవారం | నవంబర్ 6, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 37 | Friday | 6 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



తిరుమల లడ్డూ కేసు

విచారణ ఏపీలోనే..

- బదిలీ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు
- తిరుపతి లడ్డూ నెయ్యి కల్తీ కేసు విచారణపై సుప్రీం కీలక నిర్ణయం

2 లో..


- కేసును ఏపీ నుంచి బదిలీ చేయాలన్న పిటిషన్ కొట్టివేత
- ప్రస్తుత దశలో బదిలీ అవసరం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసుకు సంబంధించిన విచారణను ఆంధ్రప్రదేశ్ వెలుపలకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ కేసు విచారణను మరో రాష్ట్రానికి మార్చాలని నిందితుల్లో ఒకరు దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది.

ఇవి ఎన్నికలా.. సెలెక్షన్లా..?

● ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా హైజాక్ చేశారు

» ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం.. » వైసిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి




ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి :

వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం వైసీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" ఇవి ఎన్నికలా..సెలెక్షన్లా? ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా హైజాక్ చేశారు- ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం.ఈ ఎన్నికల్లో ఆ సూత్రాన్నే పూర్తిగా హైజాక్ చేశారు.శకుని మాయాపాచికల మాదిరిగా అధికార దుర్వినియోగం, రౌడీయిజంతో ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని రిగ్ చేశారు.- సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, 143 హామీలతో ఇంటింటికీ వెళ్లి బాండ్లు ఇచ్చిన చంద్రబాబు.. వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక ఎన్నికలనే హైజాక్ చేశారు.ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులను బైండోవర్ పేరుతో పోలీస్ స్టేషన్లకు పిలిపించి బెదిరింపులు, అరెస్టులతో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు.

టీడీపీ గూండాలతో పోలీసులు కుమ్మక్కై వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు.స్క్రూటినీ సమయంలో రిటర్నింగ్ అధికారులు నామినేషన్ పత్రాలను మాయం చేయడం, సంతకాలను ఫోర్జరీ చేయడం, నామినేషన్లను అడ్డగోలుగా తిరస్కరించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.పోటీ నుంచి తప్పుకోవాలని బలవంతపు విత్‌డ్రావల్స్ చేయించారు.. ముఖ్యమంత్రి నుంచి కలెక్టర్లు, డీఐజీలు, ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఓల వరకు ఒక మాఫియా ముఠాలా వ్యవహరించారు.

2 లో



ఎన్నికల విధుల్లో పోలింగ్ అధికారి

హరిత మృతిపట్ల సీఎం చంద్రబాబు విచారం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై పోలింగ్ అధికారి హరిత మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. హరిత (58) అనంతపురం జిల్లా డి.హీరాహాల్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు.

- మిగతా 2లో..

ప్రశాంతంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ

ఎన్నికల పోలింగ్

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ : ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ సరళిని పరిశీలించడంతో పాటు గురువారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు.



ఫోటోలు 2లో..



ఆకట్టుకునేలా తెలంగాణ ఇన్వెస్ట్

సమ్మిట్

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్
- రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, క్లైమేట్ కాంక్లేవ్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు
- సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులు వివరించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు.

4 పేజీలో..

"కార్తీక మాస పూజలు, గాజుల అలంకారోత్సవం, భవానీ దీక్షల ఏర్పాట్లపై

విస్తృత సమీక్ష"



ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో రానున్న కార్తీక మాస ప్రత్యేక పూజలు, భగినీ హస్తభోజనం సందర్భంగా శ్రీ అమ్మవారి గాజుల అలంకారోత్సవం, మరియు వార్షిక శ్రీ భవానీ దీక్ష ఉత్సవాల ముందస్తు ఏర్పాట్లపై గురువారం సాయంత్రం పరిపాలనా భవనంలోని మీటింగ్ హాల్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా

2 పేజీలో..



భారత్-శ్రీలంక తొలి వన్డేకు విశాఖ

ఆతిథ్యం

» ఢిల్లీ నుంచి వేదిక మార్పు..
» డిసెంబర్ 13న ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్

- మిగతా 2లో..

ఎబోలా వైరస్ వ్యాప్తి నివారణకు రాష్ట్రంలో

ముందస్తు జాగ్రత్తలు

» మూడు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అనుమానిత లక్షణాలు కలిగిన వారికి స్క్రీనింగ్ » నెల్లూరు, కాకినాడ, విశాఖ ఓడరేవుల్లోనూ పరీక్షలు » నవంబర్ 12న సన్నద్ధతపై మాక్ డ్రిల్ » కేంద్రానికి వివరించిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎబోలా వైరస్ వ్యాప్తి నివారణకు రాష్ట్రంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ తెలిపింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రాలు, పడకలు, వైద్య సిబ్బంది, అత్యవసర సామగ్రి, అనుమానిత కేసుల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.తిరుపతి, భోగాపురం, విజయవాడ విమానాశ్రయాల్లో ఎబోలా అనుమానిత లక్షణాలున్న వారికి స్క్రీనింగ్ చేసేందుకు వైద్య సిబ్బందిని సిద్ధం చేశామని తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు ఓడరేవుల్లోనూ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించామన్నారు.

2 లో..

ప్రజాభూమి
శుక్రవారం, నవంబర్ 6, 2026

సంపాదకీయం

ట్రంప్ విధానాలకునో!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ డెమోక్రాట్లు అధిక్యం సాధించడం ట్రంప్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తికి నిదర్శనం. ట్రంప్ అనుసరించిన ఏకపక్ష దుందుడుకు విధానాల కారణంగా ప్రపంచంలో అమెరికా ప్రతిష్ట ఎన్నడూ లేనంతగా దెబ్బతినడంతో పాటు, నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం, ఇంధన ధరల భారం అమెరికా కుటుంబాలను కుంగదీశాయి. ఇరాన్‌తో యుద్ధం ఆర్థిక అనిశ్చితిని మరింత పెంచింది. వాణిజ్య సుంకాల విధానం వల్ల ధరలు పెరిగే ప్రమాదం, వలసలపై కఠిన చర్యలతో వలస కుటుంబాల్లో నెలకొన్న భయం, ప్రభుత్వ నిర్ణయాలపై అనిశ్చితి సామాన్యుల జీవితాలను ప్రభావితం చేశాయి. ఏ దేశమైనా ప్రతి ఒక్కరూ కోరుకునేది ఉపాధి భద్రత, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య, ప్రశాంతమైన భవిష్యత్తు. ట్రంప్ వీటినే విస్మరించారు. అందుకు తగు మూల్యం చెల్లించారు. మొత్తంగా చూస్తే ఈ మధ్యంతర ఎన్నికల ఫలితాల ద్వారా అమెరికన్లు ట్రంపు విధానాలకు నో చెప్పారు. ప్రతి సమస్యకూ ప్రత్యర్థులనో, పారుగు దేశాలనో బాధ్యులుగా చిత్రించే టక్కుటమార విద్యలను అమెరికన్లు తిప్పికొట్టారు. ఫలితంగా మధ్యంతర ఎన్నికలలో డెమోక్రటిక్ పార్టీ చారిత్రక విజయాన్ని సాధించింది. కాన్సాస్‌లో దాదాపు ఒక శతాబ్దం తర్వాత డెమోక్రటిక్ పార్టీ సెనేట్ స్థానాన్ని గెలుచుకుంది. టెక్సాస్‌లోనూ దశాబ్దాలుగా కొనసాగిన రిపబ్లికన్ల ఆధిపత్యానికి గట్టి దెబ్బ తగిలింది. వాషింగ్టన్ డిసి లో సోషలిస్టు విజయం సాధించడం ఓ ప్రత్యేకత. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్ల తరపున భారతీయ అమెరికన్ల విజయాలు అభినందనీయం. ఫ్లోరిడా నుంచి పియా దండియా అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికై చరిత్ర సృష్టించగా, వర్జీనియా నుంచి సుహాస్ సుబ్రమణ్యం తిరిగి ఎన్నికయ్యారు. మేరీల్యాండ్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ అరుణా మిల్లర్ కూడా మరోసారి విజయం సాధించారు. భారతీయ మూలాలున్న ప్రజలు అమెరికా రాజకీయ, సామాజిక జీవితంలో సాధిస్తున్న ప్రగతికి ఈ విజయాలు నిదర్శనం. మొత్తం మీద ఈ మధ్యంతర ఎన్నికలలో ఐదుగురు భారతీయ మూలాలున్నవారు కాంగ్రెస్‌కు ఎన్నికైనట్లు సమాచారం. ఇది ఆహ్వానించదగిన పరిణామం. రెండు దేశాల మధ్య సంబంధాల విస్తరణకు వీరి ఎన్నిక దోహద పడే అవకాశం ఉంది. అదే సమయంలో ట్రంప్ మద్దతుతో ఒహాయో గవర్నర్ పదవికి పోటీ చేసిన వివేక్ రామస్వామి డెమోక్రటిక్ అభ్యర్థి అమీ ఆక్టన్ చేతిలో ఓడిపోవడం గమనార్హం. భారతీయ మూలాలున్న నాయకుడిగా వివేక్ రామస్వామికి ఎంతో గుర్తింపు ఉన్నప్పటికీ ట్రంప్‌తో జత కట్టడంతో ఆయన ఓడిపోయారు. న్యూయార్క్ అటార్నీ జనరల్‌గా పోటీ చేసిన సరితా కోమటిరెడ్డిది కూడా ఇదేస్థితి. ట్రంప్ విధానాలపై అమెరికన్ల ఆగ్రహానికి ఇది కూడా కూడా ఒక నిదర్శనం. అయితే, ఈ ఎన్నికల ఫలితాల తరువాత కూడా డెమోక్రాట్ల చేతికి పెద్దగా అధికారాలేమీ రాకపోయినా, ట్రంప్ ప్రభుత్వ విధానాలను పరిశీలించే, ప్రభుత్వ కార్యకలాపాలపై విచారణలు చేపట్టే, కీలక నియామకాలను అడ్డుకునే అవకాశం కొంత మేర పెరుగుతుంది. చట్టాల ఆమోదం, ప్రభుత్వ వ్యయం వంటి అంశాల్లో చర్చలు, రాజీలు తప్పనిసరిగా మారుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బహుశా ఈ కారణంతోనే తన ఆలోచనలు అమలు కాకపోతే తనకున్న ప్రత్యేక అధికారం (వీటో)ను వినియోగించడానికి వెనుకాడనని ట్రంప్ చెప్పారు. భవిష్యత్‌లో చోటుచేసుకునే పరిణామాలకు ఆయన మాటలను సంకేతాలుగా భావించవచ్చు. అమెరికా ఫలితాలను ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఈ తరహా ధోరణులలో భాగంగానే చూడాలి. బ్రిటన్‌లో అధికార మార్పు నుండి నిన్నమొన్నటి సెర్బియా విద్యార్థుల ఉద్యమం వరకు అధికారంలో ఉన్న వారి అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పిన ఉదాహరణలు ఎన్నో! దేశాలు, పరిస్థితులు వేర్వేరైనా, ప్రజల జీవన సమస్యలను విస్మరించి అధికారమే పరమావధిగా వ్యవహరించే పాలకులకు ఎదురుదెబ్బ తప్పదనే సందేశం దీనిలో స్పష్టంగా ఉంది. మన దేశంలోనూ 2024 ఎన్నికల్లో బిజెపి సాంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజార్టీని కోల్పోయింది. ఆ తరువాత కూడా నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్, మతోన్మాద విధానాలను అమలు చేస్తూ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుండటంతో యువత పెద్ద ఎత్తున రోడ్లమీదకు రావాల్సి వచ్చింది. అమెరికాలో కూడా ట్రంప్ విధానాలపై అసంతృప్తితో ఓటేసిన ప్రజలు, ప్రత్యామ్నాయంగా ముందుకొచ్చే పార్టీ నుంచి కూడా స్పష్టమైన పరిష్కారాలను ఆశిస్తారు. ఇరాన్‌తో యుద్ధం ముగింపుతో పాటు ధరల నియంత్రణ, ఉద్యోగాల కల్పన, వైద్య ఖర్చుల తగ్గింపు, వలసదారుల హక్కులకు గౌరవం, సామాజిక భద్రత, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత వంటి అంశాలలో డెమోక్రాట్ల కార్యాచరణను వారు పరిశీలిస్తారు. అందువల్ల ఈ ఫలితాలు వారికి నిజమైన పరీక్షగా మారనున్నాయి. ట్రంప్ విధానాల కారణంగా ఎదుర్కున్న సమస్యలకు విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాలను, మార్గాలను చూపాల్సిన బాధ్యత డెమోక్రాట్లపై ఉంది. ?

ఎన్నికల విధుల్లో పోలింగ్ అధికారి హరిత మృతిపట్ల

సీఎం చంద్రబాబు విచారం

ఎన్నికల విధుల్లో భాగంగా ఆమె కూడేరు మండలం కాడదారకుంట పోలింగ్ కేంద్రంలో విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో శ్వాస సంబంధిత సమస్య తలెత్తడంతో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య బృందం వెంటనే ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించింది. అక్కడ అత్యవసర వైద్య చికిత్స అందించినప్పటికీ గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు ఆమె మరణించారు. హరిత మృతి పట్ల ముఖ్యమంత్రి ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరిత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

తిరుమల లడ్డూ కేసు

విచారణ ఏపీలోనే..

ప్రస్తుత దశలో కేసును బదిలీ చేయాల్సినంత బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేసింది.ఈ కేసులో నిందితుడిగా ఉన్న మహారాష్ట్రకు చెందిన వ్యాపారవేత్త, మాల్గంగా మిల్క్ అండ్ అగ్రో ప్రొడక్ట్స్ ఎండీ మచీంద్ర శాంతారాం లంకే ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఈ కేసుపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనివల్ల నిష్పక్షపాత విచారణకు ప్రతికూల వాతావరణం ఉందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే కోర్టుకు తెలిపారు.దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్... “మా ఆదేశాలతో వారందరినీ మౌనంగా ఉండేలా చేశాం. ఏదైనా జరిగితే మీరు మా వద్దకు రావచ్చు” అని వ్యాఖ్యానించారు. తాము గతంలో ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా రాజకీయ నేతలు వ్యాఖ్యలు చేశారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కేసు బదిలీకి తగిన కారణాలు లేవని పేర్కొంటూ, పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. దీంతో ఈ కేసు విచారణ ఇకపై ఆంధ్రప్రదేశ్‌లోనే కొనసాగనుంది.



ఇవి ఎన్నికలా..

సెలెక్షన్లా?

ఎన్నికల వ్యవస్థకు రిఫరీగా ఉండాల్సిన ఎస్ఈసీ సైతం చంద్రబాబుకు తొత్తుగా మారడంతో ప్రజాస్వామ్యాన్ని కాపాడే వ్యవస్థలే విఫలమయ్యాయి.రాష్ట్రవ్యాప్తంగా 17 మున్సిపాలిటీల్లో వైయస్ఆర్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థులను నామినేషన్ వేయనీయలేదు.. మరో 22 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నామినేషన్ దశలోనే పోటీ లేకుండా చేశారు.పులివెందులలో 40 వార్డులకు కేవలం 20 వార్డుల్లోనే వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయగలిగారు.. మిగిలిన వార్డుల్లో పోటీ లేకుండా చేశారు.– కాళ్లు చేతులు కట్టేసి పోటీలోకి దింపిన పరిస్థితుల్లోనూ పోలింగ్ రోజున వైయస్ఆర్‌సీపీ ఏజెంట్లను బూత్‌ల్లో కూర్చోనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు.పోలీసుల కళ్ల ముందే టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడుతున్నా పట్టించుకోని పరిస్థితి.. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న ఇలాంటి ఎన్నికలను అసలు ఎన్నికలు అని పిలవగలమా?– ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఈ ఎన్నికలు దేశానికి ఒక కేస్ స్టడీగా నిలుస్తాయి.ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. ఆ ప్రజాస్వామ్య హక్కునే పూర్తిగా హైజాక్ చేసి చంద్రబాబు ఈ ఎన్నికలు నిర్వహించారు.

“శకుని మాయాపాచికల్లా ఎన్నికల ప్రక్రియను రిగ్ చేశారు”

అధికార దుర్వినియోగం, రౌడీయిజంతో ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూ ఎన్నికల వ్యవస్థను మొత్తం తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. “సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, 143 హామీలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ఎన్నికలను హైజాక్ చేశారు” ప్రతి ఇంటికీ బాండ్లు ఇచ్చి జూన్ 2024 నుంచి డబ్బులు ఖాతాల్లో వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఆ హామీలు మోసాలుగా మారడంతో ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక ఈ దుస్థితికి దిగజారారు.“వేలాది మంది వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలను బైండ్‌ఓవర్ పేరుతో పోలీస్ స్టేషన్లకు పిలిచి బెదిరించారు, అరెస్టులు చేశారు” ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే ప్రజాస్వామ్యాన్ని అణిచివేసే ప్రక్రియను ప్రారంభించారు. “టీడీపీ గుండాలతో పోలీసులు కుమ్మక్కై మా అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వలేదు” నామినేషన్లను అడ్డుకోవడం ఒకవైపు.. స్క్రూటినీ పేరుతో పత్రాలు మాయం చేయడం, సంతకాలు ఫోర్జరీ చేయడం, నామినేషన్లను అడ్డగోలుగా తిరస్కరించడం మరోవైపు జరిగింది. “17 మున్సిపాలిటీల్లో మా చైర్‌పర్సన్ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వలేదు” మరో 22 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నామినేషన్ల దశలోనే పోటీ లేకుండా చేశారు. పులివెందులలో 40 వార్డులకు 20 వార్డుల్లో మాత్రమే మా అభ్యర్థులు నామినేషన్లు వేయగలిగారు.

“జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ అదే దౌర్జన్యం”

84 జెడ్పీటీసీ స్థానాలు, 2,109 ఎంపీటీసీ స్థానాల్లో నామినేషన్ల దశలోనే పోటీ లేకుండా చేశారు. అభ్యర్థుల అరెస్టులు, పోలింగ్ ఏజెంట్లను బూత్‌ల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకోవడం కొనసాగించారు.

“సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేశారు”

నామినేషన్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాల వరకు సీసీ కెమెరాలు ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా.. మున్సిపల్ ఎన్నికల్లో 11,378 పోలింగ్ కేంద్రాలకు కేవలం 5,737 కేంద్రాల్లోనే, జెడ్పీటీసీ--ఎంపీటీసీ ఎన్నికల్లో 31,460 కేంద్రాలకు కేవలం 16,064 కేంద్రాల్లోనే సీసీ కెమెరాలు పెట్టారు.

“నామినేషన్ల నుంచి ఫలితాల వరకు ఎన్నికల ప్రక్రియను రిగ్ చేశారు” : నామినేషన్ల రిగ్గింగ్, స్క్రూటినీ రిగ్గింగ్, పోలింగ్ బూత్‌ల రిగ్గింగ్, పోలింగ్ శాతం రిగ్గింగ్, రాత్రిపూట బ్యాలెట్ బాక్సుల రిగ్గింగ్ వరకు ఎన్నికల ప్రక్రియ మొత్తం కబ్జా చేశారు.

“పోలింగ్ బూతుల్లోకి మా ఏజెంట్లను వెళ్లనివ్వకుండా టీడీపీ రౌడీలతో పోలీసులు కుమ్మక్కయ్యారు”

కళ్ల ఎదుటే రిగ్గింగ్ జరుగుతున్నా అడ్డుకోవాల్సిన పోలీసులు దానికి సహకరిస్తే.. ఇలాంటి ఎన్నికలను అసలు ఎన్నికలు అని ఎలా అంటారు?

“విశాఖలో మా వాళ్లు గొడవ చేసి అడిగిన తర్వాతే స్ట్రాంగ్ రూములకు సీల్ వేశారు” : బ్యాలెట్ బాక్సులు కూడా రాత్రిపూట రిగ్గింగ్ చేసే పరిస్థితి కనిపించింది. ఇన్ని అక్రమాలు దాటుకుని ఎక్కడైనా వైయస్ఆర్‌సీపీ గెలిస్తే ఆ ఫలితాలను కూడా రిగ్గింగ్ చేసే పరిస్థితి ఏర్పడింది.

“ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల వ్యవస్థే అధికార పార్టీ గుప్పిట్లోకి వెళ్లిపోయింది”

చంద్రబాబు, ఆయనకు సంబంధించిన అధికారులు, పోలీసులు, ఆర్వోలు, ఎస్ఈసీ కలిసి ఎన్నికల వ్యవస్థను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. ఇవి ఎన్నికలా.. సెలెక్షన్సా అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాల”ని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేసారు.

ప్రశాంతంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్

ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైల్వే వాగన్ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం, విజయవాడ రూరల్ మండలం పాతపాడులోని పోలింగ్ కేంద్రం, గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, పోలింగ్ నిర్వహణ తీరు, భద్రతా ఏర్పాట్లపై పోలింగ్ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లతో కూడా మాట్లాడి పోలింగ్ సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. అన్ని ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేవని ఓటర్లు, పోలింగ్ సిబ్బంది తెలిపారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్ల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. జిల్లా యంత్రాంగం



పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టిందని, అన్ని రాజకీయ పార్టీలు తమ బాధ్యతలను చక్కగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ ప్రక్రియ పూర్తవుతుందని ఆశిస్తున్నామని, అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తామని తెలిపారు. రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన అన్ని లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరుస్తామని పేర్కొన్నారు.తాను సందర్శించిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా ఏర్పాటు చేసినట్లు, స్ట్రాంగ్ రూమ్‌లలో కూడా నిరంతర సీసీటీవీ పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివరించారు. కృష్ణా జిల్లా ఎన్నికల అబ్జర్వర్ వి. అభిషేక్ తో కూడా ఎన్నికల సరళి గురించి మాట్లాడారు.. పోలింగ్ ముగియడానికి ఇంకా సమయం ఉన్నందున ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ విజ్ఞప్తి చేశారు.

”కార్తీక మాస పూజలు, గాజుల అలంకారోత్సవం,

భవానీ దీక్షల ఏర్పాట్లపై విస్తృత సమీక్ష”

నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ,వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య , డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్,అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఇఇ రమాదేవి,ఏఈవోలు చంద్ర శేఖర్, సుధారాణి, రమేష్ బాబు, గంగాధర్, తిరుమలేశ్వరరావు, లక్ష్మి ప్రసన్న మరియు సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ.. నవంబర్ 10 నుండి ప్రారంభం కానున్న కార్తీక మాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఆలయంలో జరిగే ఆకాశదీపం, నిత్య అభిషేకాలు, బిల్వార్చనలు, కార్తీక పౌర్ణమి నాటి కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం కార్యక్రమాలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నవంబర్ 11న భగినీ హస్తభోజనం పర్వదినాన శ్రీ కనకదుర్గ అమ్మవారికి నిర్వహించే విశేష గాజుల అలంకారోత్సవ



దర్శనానికి విచ్చేసే భక్తులకు క్యూలైన్లలో సౌకర్యాలు, ప్రసాద వితరణలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
?అనంతరం నవంబర్ 20 నుండి ప్రారంభం కానున్న భవానీ దీక్షాధారణలు, డిసెంబర్ 24న జరిగే కలశజ్యోతి మహోత్సవం, డిసెంబర్ 30 నుండి జనవరి 03 వరకు జరిగే దీక్షా విరమణల ఏర్పాట్లపై సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రం నలుమూలల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి లక్షలాదిగా తరలివచ్చే భవానీ భక్తులకు కేశఖండనశాలలు, స్నానఘట్టాలు, తాగునీరు, నిరంతర అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం నిల్వలు మరియు హోమగుండాల వద్ద భద్రతా చర్యలను ఇంజినీరింగ్, భద్రతా విభాగాలతో సమన్వయం చేసుకుని ముందస్తుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. క్షేత్రానికి వచ్చే భక్తులెవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమష్టి బాధ్యతతో పనిచేయాలని ఈవో ఆదేశించారు.

భారత్-శ్రీలంక తొలి వన్డేకు విశాఖ ఆతిథ్యం

ఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులకు శుభవార్త. భారత్-శ్రీలంక జట్ల మధ్య జరగనున్న తొలి వన్డే మ్యాచ్‌కు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. తొలుత ఢిల్లీలో నిర్వహించేందుకు నిర్ణయించిన ఈ మ్యాచ్‌ను విశాఖకు మారుస్తున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 13న జరగాల్సిన మ్యాచ్ తేదీలో ఎలాంటి మార్పు లేదని, కేవలం వేదికను మాత్రమే మార్చినట్లు స్పష్టం చేసింది. ఢిల్లీలో డిసెంబర్ నెలలో నెలకొనే ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పాటు స్టేడియంలో చేపట్టాల్సిన పునరుద్ధరణ పనుల నేపథ్యంలో మ్యాచ్ వేదికను మార్చాలని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) బీసీసీఐని కోరింది. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన బీసీసీఐ తొలి వన్డేను విశాఖపట్నంలోని ఏసీఏ--వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో డిసెంబర్ 13న జరగనున్న మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం విశాఖ క్రికెట్ అభిమానులకు దక్కనుంది. శ్రీలంక జట్టు భారత పర్యటనలో భాగంగా మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొననుంది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేశారు. వన్డే సిరీస్ షెడ్యూల్ తొలి వన్డే: డిసెంబర్ 13, ఆదివారం -- విశాఖపట్నం (మధ్యాహ్నం 2 గంటలకు) రెండో వన్డే: డిసెంబర్ 16, బుధవారం -- బెంగళూరు (మధ్యాహ్నం 2 గంటలకు) మూడో వన్డే: డిసెంబర్ 19, శనివారం -- అహ్మదాబాద్ (మధ్యాహ్నం 2 గంటలకు) టీ20 సిరీస్ షెడ్యూల్ తొలి టీ20: డిసెంబర్ 22, మంగళవారం -- రాజ్‌కోట్ (రాత్రి 7 గంటలకు) రెండో టీ20:



డిసెంబర్ 24, గురువారం -- కటక్ (రాత్రి 7 గంటలకు) మూడో టీ20: డిసెంబర్ 27, ఆదివారం -- వేదిక వివరాలు అందుబాటులో లేవు (రాత్రి 7 గంటలకు)

ఎబోలా వైరస్ వ్యాప్తి నివారణకు రాష్ట్రంలో ముందస్తు జాగ్రత్తలు

ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో సన్నద్ధతను పరీక్షించేందుకు నవంబర్ 12న మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనుమానిత కేసుల గుర్తింపు, ఐసోలేషన్, వైద్య నిర్వహణ, రిఫరల్ విధానాల అమలుకు అన్ని విభాగాలను అప్రమత్తం చేస్తామన్నారు.

21 రోజుల ప్రయాణ వివరాల పరిశీలన

ఎబోలా నియంత్రణకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల అమలుపై నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అదనపు సంచాలకుడు డాక్టర్ హిమాన్షు చౌతా, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శుభా గార్గ్ (మైక్రో), ఇతర అధికారులు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 2026 అక్టోబర్ 31 నాటికి ప్రపంచవ్యాప్తంగా నమోదైన కేసులు, మరణాల వివరాలను వెల్లడించారు. కాంగో ప్రజాస్వామ్య గణతంత్ర దేశంలో 10,467 కేసులు, 5,103 మరణాలు; కెన్యాలో 9 కేసులు, 2 మరణాలు; ఉగాండాలో 20 కేసులు, 2 మరణాలు; నైజీరియాలో ఒక కేసు; ఫ్రాన్స్‌లో ఒక కేసు నమోదయ్యాయి. మొత్తంగా ఐదు దేశాల్లో 10,498 నిర్ధారిత కేసులు, 5,107 మరణాలు నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుత వ్యాప్తికి బుండిబుగ్యో వైరస్ రకం కారణమని, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆఫ్రికా వ్యాధి నియంత్రణ సంస్థ సూచించిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.



ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ఆరోగ్య పరీక్షలు, గత 21 రోజుల ప్రయాణ చరిత్రను తనిఖీ చేయాలని సూచించారు. లక్షణాలు లేని ప్రయాణికులను ఇంటి వద్ద స్వీయ పర్యవేక్షణలో ఉంచాలని, వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవారిని 21 రోజుల పాటు వైద్య పర్యవేక్షణలో ఉంచాలని తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారిని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా ఐసోలేషన్ ఆసుపత్రికి తరలించాలన్నారు. విమాన ప్రయాణ సమయంలో లక్షణాలు కనిపిస్తే ప్రయాణికుడిని ఇతరుల నుంచి వేరు చేసి విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానిత నమూనాల పరీక్షలకు పుణెలోని ఐసీఎంఆర్--నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ)లో సదుపాయాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబ్, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (ఎస్వీఐఎంఎస్) వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబ్, విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లలోనూ నమూనాల పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆసుపత్రులు, పడకలు, కిట్లు, మాస్కులు సిద్ధం

ఎబోలా అనుమానిత కేసుల వైద్య నిర్వహణకు రాష్ట్రంలోని ఐదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు వివరించారు. మొత్తం 46 పడకలు, 3,288 పీపీఈ కిట్లు, 104 నమూనా సేకరణ కిట్లు, ఐదు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు కేంద్ర అధికారులకు తెలిపారు.
సమీక్షలో వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ అట్టలూరి విష్ణువర్ధన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్. వెంకట రమణ, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె. అర్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శుక్రవారం, నవంబర్ 06, 2026

ఈ నెల 7న ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల కౌంటింగ్

- ప్రక్రియ విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈ నెల 7వ తేదీన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో తదుపరి కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు నిర్వహణకు సంబంధించి మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు సంబంధించి మైలవరంలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ గురువారం తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సుల భద్రత, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



పోలింగ్ సరళిని పరిశీలించిన కృష్ణా జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు వి. అభిషేక్

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:



కృష్ణా జిల్లా స్థానిక సంస్థల ఎన్ని కలు–2026 నిర్వహణలో భాగంగా గురువారం కృష్ణా జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు వి. అభిషేక్ బాపులపాడు మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలిం గ్ సరళిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సంద ర్భంగా బాపులపాడు మండల తహసీల్దార్ కార్యాల యం ఎదురుగా ఉన్న పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణ, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు.ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పుణ్యక్షేత్ర దర్శన ప్యాకేజీలను ప్రవేశపెట్టిన ఏపీటీడీసీ

ప్రతి సోమవారం పంచారామాల యాత్ర..ప్రతి శనివారం వాడపల్లి పుణ్యక్షేత్ర యాత్ర

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తులకు ప్రత్యేక పుణ్యక్షేత్ర దర్శన ప్యాకేజీలను ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అందుబాటులోకి తీసుకువస్తోందని ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ (టూర్స్ & మార్కెటింగ్) టి. ఎస్. వీరనారాయణ ఒక ప్రకటనలో తెలి పారు. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సౌకర్యవంతంగా దర్శించుకొని ఆధ్యాత్మిక అను భూతిని పొందేందుకు ఈ ప్రత్యేక యాత్రలను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం పం చారామాల యాత్రను, ఏడాది పొడవునా ప్రతి శనివారం విజయవాడ–వాడపల్లి–విజయవాడ పుణ్య క్షేత్ర యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలను ఏపీటీడీసీ 12 సీట్ల మినీ ఏసీ బస్సు ద్వారా నిర్వహించి భక్తులకు సురక్షితమైన, ప్రయాణాన్ని అందించనున్నట్లు వివరించారు.

పంచారామాల ప్రత్యేక ప్యాకేజీ ...ఒకే రోజులో ఐదు పవిత్ర పంచారామ క్షేత్రాలను దర్శించుకునే ఈ ప్రత్యేక ప్యాకేజీలోఅమరలింగేశ్వర స్వామి ఆలయం (అమరావతి), కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం (సామర్లకోట), భీమేశ్వర స్వామి ఆలయం (ద్రాక్షారామం), క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం (పాలకొల్లు), సోమేశ్వర స్వామి ఆలయం (భీమవరం) దర్శించుకునే అవకాశం కల్పి స్తున్నట్లు తెలిపారు.ఈ యాత్ర నవంబర్ 16, 23, 30 తేదీలతో పాటు డిసెంబర్ 7, న కూడా నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 5 గంటలకు విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న ఏపీటీడీసీ సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం నుంచి యాత్ర ప్రారంభమై, అదే రోజు రాత్రి సుమారు 10 గంటలకు తిరిగి విజయవాడ చేరుకుంటుందని తెలిపారు.ఈ ప్యాకేజీకి పెద్దలకు రూ. 2,370, పిల్లలకు రూ. 1,920 చార్జీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. దర్శన టికెట్లు, భోజనం మరియు ఇతర వ్యక్తిగత ఖర్చులను ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రతి శనివారం వాడపల్లి పుణ్యక్షేత్ర యాత్ర..విజయవాడ నుంచి వాడపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి శనివారం ఏడాది పొడవు నా ప్రత్యేక ప్యాకేజీ నిర్వహిస్తున్నట్లు వీరనారాయణ తెలిపారు. ఈ యాత్ర ద్వారా భక్తులు అదే రోజు స్వామివారిని దర్శించుకొని తిరిగి విజయవాడ చేరుకునేలా రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ ప్యాకేజీకి పెద్దలకు రూ. 1,350, పిల్లలకు రూ. 1,100 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. దర్శన టికెట్లు, భోజనం మరియు ఇతర వ్యక్తిగత ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని వివరించారు.

ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం..ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు ఇబ్బందులు లేని పుణ్యక్షేత్ర యాత్రలను అందించడమే ఏపీటీడీసీ లక్ష్యమని టి. ఎస్. వీరనారాయణ, జనరల్ మేనేజర్ (టూర్స్ & మార్కెటింగ్) తెలిపారు.కార్తీక మాసం సందర్భంగా భక్తులు ఈ ప్రత్యేక ప్యాకేజీలను సద్వినియోగం చేసుకొని పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ (టూర్స్ & మార్కెటింగ్) టి. ఎస్. వీరనారాయణ ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రాదేశిక పోలింగ్ ప్రశాంతం

ముగిసిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక ఎన్నికల పోలింగ్ ఈనెల 7వ తేదీన ఫలితాలు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:


కృష్ణా జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మచిలీపట్నం నార్త్ మండ లంలో 9 ఎంపీటీసీ స్థానాలకు 20 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 36 కేంద్రాల్లో ఓటింగ్ ప్రకియ పూర్తయింది. మచిలీపట్నం సౌత్ మండ లంలో 11 ఎంపి టీసీ స్థానాలకు 29 మంది అభ్యర్థులు బరిలో పోటీకి నిలిచారు. 38 కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పెడన ఎంపీటీసీ స్థానాలు 10 కాగా, 20 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 39 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సజావుగా సాగింది. గూడూరులో 14 ఎంపీటీసీ స్థానాలకు 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 55 కేంద్రాల్లో పోలింగ్ ముగిసింది. బంటుమిల్లిలో 13ఎంపీటీసీ స్థానాలకు 28 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 44 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ముగిశాయి. కృత్తివెన్ను మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 46 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 71 ఎంపీటీసీ స్థానాలకు 157 మంది బరిలో నిలవగా 258 పోటింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఉదయం 7 గం.ల నుంచి సా.5 గం.ల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సమస్యాత్మక, అతిసమస్యాత్మక ప్రాంతాలపై పోలీసు శాఖ ప్రత్యేక దబ్బుష్టి పెట్టి బందోబస్తు పటిష్టంగా నిర్వహించారు. 6 మండలాల పరిధిలో 35 అతి సమస్యాత్మక, 92 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తుతోపాటు వెబ్‌క్యాస్టింగ్ కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తంమీద ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం అభినందనీయం. ప్రాదేశిక పోరులో ఓట్లు పోటెత్తాలని వివిధ పార్టీల అభ్యర్థులు, పార్టీలు కోరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 50 శాతంపైగా ఓట్లు పోలవ్వగా బందరు మండలంలో 69 శాతం ఓటింగ్ నమోదైంది. ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 9,200 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. 1500 మంది పోలింగ్ అధికారులు, 1500 మంది సహాయ పోలింగ్ అధికారులు, 6100 మంది ఇతర పోలింగH అధికారులు, 300 మంది మైక్రో అబ్జర్వర్లు, 1,266 బిఎల్వోలను జిల్లా అధికారులు నియమించారు. వీరు పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించారు. ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరిగాయి. అసాంఘిక కార్యక్రమాలు, అల్లర్లకు పాల్పడకుండా అనుమానం ఉన్న వ్యక్తులను బైండోవర్ చేసేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు శాఖ ముందే హెచ్చరికలు జారీచేయడంవల్ల జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలు జరిగే విధానంపై వీడియోగ్రఫీ, వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బ్యాలెట్ పెట్టెలను పటిష్టంగా భద్రపరచి 25 ప్రాంతాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు పంపారు. గుడివాడ వికెఆర్ విఎస్‌బి కాలేజీ, మచిలీపట్నం కృష్ణా యూనివర్శిటీ, అవనిగడ్డ డిఫెన్స్ జూనియర్ కళాశాల, మొవ్వ డిగ్రీ కళాశాల, పెనమలూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, ఉయ్యూరు విఆర్‌కెఎఎం కాలేజీల్లో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. శనివారం 7వ తేదీ ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. నియోజక వర్గాల వారీగా అవనిగడ్డలో 253 పోలింగ్ కేంద్రాలు, గన్నవరం 245 పోలింగ్ కేంద్రాలు, పెడన 184 పోలింగ్ కేంద్రాలు, గుడివాడ 118 పోలింగ్ కేంద్రాలు, పెనమలూరు 150 పోలింగ్ కేంద్రాలు, పామర్రు 242 పోలింగ్ కేంద్రాలు, మచిలీపట్నం 74 పోలింగ్ కేంద్రాలు వెరసి మొత్తం 1,266 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ జరిగింది.

ప్రాదేశిక ఎన్నికలు జిల్లాలోని ఓటర్లు 9,98,054; జడ్పీటీసీ స్థానాలు 26; జడ్పీటీసీ ఏకగ్రీవాలు 9; ఎంపీటీసీ స్థానాలు 352; పోలింగ్ జరిగినవి 343; పోలింగ్ కేంద్రాలు : 1,266; బ్యాలెట్ బాక్సులు 3,000; ఎన్నికల సిబ్బంది 9,200; పోలింగ్ సిబ్బంది 849; ఫలితాల వెల్లడి : నవంబర్ 7.

మొత్తం మీద జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. 7వ తేదీ విడుదలయ్యే ఫలితాల కోసం జిల్లా లోని ఆయా మండలాల ఓటర్లు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

ఘనంగా ఎస్ఐ ఎ. రామశాస్త్రులు పదవీ విరమణ వేడుక

మచిలీపట్నం, ప్రజాభూమి:



బందర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సబ్‌ఇన్ స్పెక్ట ర్‌గా సుదీర్ఘకాలం సేవలందించిన ఎ. రామశా స్త్రులు పదవీ విరమణ వేడుక మచిలీపట్నంలోని మిరియాల కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహిం చా రు. ఈ కార్యక్రమానికి పోలీస్ అధికారులు, సి బ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయ నకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రామశాస్త్రులు దంపతులు అల్లూరి రామశాస్త్రులు, అల్లూరి రామా తులసి దంపతులను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపికలు అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పోలీస్ శాఖలో నిబద్ధత, క్రమ శిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించిన రామశాస్త్రులు సేవలను కొనియాడారు. ము ఖ్యం గా బందర్ ట్రాఫిక్ విభాగంలో ట్రాఫిక్ క్రమబద్ధీ కరణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అం దించడంలో ఆయన చూపిన చొరవ, బాధ్యతా యుతమైన పనితీరు ప్రశంసనీయమని పేర్కొ న్నారు. ఆయన సేవలు పోలీస్ శాఖకు, ప్రజలకు చిరస్మరణీయమని అభిప్రాయపడ్డారు. ఈ పదవీ విరమణ వేడుకను ఎ. మధుకర్ కుటుం బం, ఎ. మోహన్ సాయి కుమార్ కుటుం బం ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో పాల్గొన్నవారంతా రామశాస్త్రులు దంపతు లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్తు జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

ప్రజాస్వామ్య పండగలో ఎన్ఎస్ఎస్ సేవా స్ఫూర్తి

- పోలింగ్ నిర్వహణలో పోలీసులకు అండగా వాలంటీర్లు
- ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు అందించడంలో ప్రత్యేకత

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ఎస్) వాలంటీర్లు తమ సేవా స్ఫూర్తిని చాటు కున్నారు. విజయవాడ, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ మండలాలకు చెందిన 10 కళాశాలల నుంచి సుమారు 900 మంది విద్యార్థి వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల విధుల నిర్వహణలో తమ సేవలందిం చారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు క్యూ లైన్ల నిర్వహణ, ఓటర్ల రాకపోకల క్రమబద్ధీ కరణ, పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ పాటించేలా సహకరించారు. ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు సహా సహా యం అవసరమైన ఓటర్లకు అవసరమైన సహకారం అందిస్తూ పోలింగ్ ప్రక్రియలో వారికి ఇబ్బందులు కలగకుండా తోడ్పడ్డారు. యువతలో సామాజిక బాధ్యత, సేవా భావం పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రి యలో వాలంటీర్లు స్వచ్ఛందంగా భాగస్వాములు కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బందితో కలిసి బాధ్యతాయుతంగా సేవలందించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మార్గనిర్దేశనం చేయడంలో జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్ కీలకపాత్ర పోషించారు.



పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తూ ఎస్పీ సుడిగాలి పర్యటన

- బందరు, పెడన, పామర్రు, మొవ్వ ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాల సందర్శన
- పోలింగ్ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి భద్రతా పరమైన సూచనలు- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

కృష్ణా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు జిల్లావ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేపట్టి పోలింగ్ సరళిని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు.ఈ పర్యటనలో భాగంగా బందరు మండలంతో పాటు పెడన, పామర్రు, మొవ్వ ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి, విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటరు ఎటువంటి భయం, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, అల్లర్లు, గొడవలకు పాల్పడినా ఉపేక్షించకుండా వారిపై చట్టప్ర కారం కఠిన చర్యలు తీసుకో వాలని స్పష్టం చేశారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎక్కడిక క్కడ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలందరూ ఎలాంటి ఆందోళనకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.మరోవైపు పోలీస్ సిబ్బందితో పాటు ఎన్నికల విధుల్లో 'మేము సైతం' అంటూ జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటూ ఎన్నికల నిర్వహణలో తమ వంతు సహకారం అందించడం విశేషం.



పదవులకే వన్నె తెచ్చిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ...

మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

కృష్ణా జిల్లా వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్ని కలను సమర్థవంతంగా ఏ విధమైన అవాంఛ నీయ సం ఘ టనలు జరగకుండా ఎంతో పకడ్బందీగా ఎన్ని కలు నిర్వ హించి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పదవులకి వన్నె తెచ్చిన డీ కే బాలాజీ మరియు విద్యాసాగర్ నాయుడుకు మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్య క్షులు లంకిశెట్టి బాలాజీ జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక పక్కన రెండు తుఫాన్లు మరొక పక్కన నగర, రూరల్ ఎన్నికలను ఎదుర్కొని జిల్లా ప్రజల చేత శే హభాష్ అనిపించుకున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మరియు వారి సిబ్బంది అభినందనీయులని బాలాజీ అన్నారు. ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా తుఫానులు ఎదుర్కొని ఎక్కడా రీపోలింగ్ లేకుండా ఎన్నికల నిర్వహించి ఆదర్శవం తమైన పాలన అందించారని బాలాజీ అన్నారు. పోలీస్, రెవెన్యూ, ఉపాధ్యాయులు, పంచాయతీ, మున్సిపల్ విద్యుత్ మరియు ఎన్నికల అనుబంధంగా పనిచేసిన ప్రతి ఒక్కరూ అభినందనీయు లన్నీ బాలాజీ అన్నారు.ఎన్నికల ఫలితాలను తుఫాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసి అప్రమత్తం చేసిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా కూడా బాలాజీ ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన అభ్యర్థులు నీతివంతమైన సమర్థవంతమైన పాలన అందించి వారి పదవులకు వన్నె తీసుకురావాలని బాలాజీ విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్

❖ గన్నవరం జడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల సందర్శన ❖ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన ❖ పోలీస్ అధికారులకు పలు సూచనలు ❖ జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పోలింగ్



ప్రజాభూమి ప్రతినిధి, గన్నవరం

కృష్ణా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, గన్నవరం డీఎస్పీ జయకృష్ణ ఇతర పోలీస్ అధికారులతో కలిసి గన్నవరం జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.తదుపరి ఎస్పి బుద్దవరం, దావాజీ గూడెం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసి, విధుల్లో ఉన్న గన్నవరం మండల పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతోందని తెలిపారు.

ప్రజలు ఎంతో ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు.ఎన్నికల విధుల్లో పోలీస్ సిబ్బందితో పాటు మహిళా సంరక్షణ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు, జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) విద్యార్థులు కూడా చురుకుగా పాల్గొంటూ ఎన్నికల నిర్వహణకు సహకరిస్తున్నారని తెలిపారు.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శుక్రవారం 6 నవంబర్ 2026



కరప, కాజులూరు మండలాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

ప్రజాభూమి ప్రతినిధి,కరప/కాజులూరు:

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఓటింగ్ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ పరిశీలనలో భాగంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. కరప, కాజులూరు మండలాల్లో పర్యటించారు. కరపలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటింగ్ కేంద్రాన్ని, అలాగే కాజులూరు మండలం మంశజేరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఓటర్ల హాజరు శాతాన్ని, ఓటింగ్ సరళిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడి పోలింగ్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్ల నిర్వహణ, పోలింగ్ నమోదు, పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగులకు కల్పించిన ప్రత్యేక సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ప్రాథమిక వసతులను సిద్ధంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, పోలింగ్ ముగిసే వరకు సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించి, ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని జేసీ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జేసీ వెంట ఆయా మండలాల రెవెన్యూ, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్

ప్రజా భూమి ప్రతినిధి – చాట్రాయి

గత పది రోజులుగా చాట్రాయి మండలంలోని జడ్పిటిసి ,ఎంపీటీసీ ఎన్నికలలో జోరుగా ప్రచారం సాగించిన అభ్యర్థులకు గురువారం ప్రజలు ఓటు ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరగటానికి ప్రధాన కారణం ఎస్సై డి.రామకృష్ణ తన సిబ్బందితో శాఖ సక్యంగా బందోబస్తు నిర్వహించి ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ప్రశాంతంగా ప్రజలు తమ ఓటు హక్కును విరిగించుకోవటానికి ప్రశాంతమైన వాతావరణాన్ని ఎస్ఐ.డి. రామకృష్ణ కల్పించారు. మండల కేంద్రమైన చాట్రాయి లో 75% ఎన్నికల పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు.

తాళ్లపూడిలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్


ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



తాళ్లపూడి మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని గ్రామాల్లో ఉదయం 7.30 గంటల తర్వాత పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 9.30 గంటలకు 12.75 శాతం, మధ్యాహ్నం 1.30 గంటలకు 47.50 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 60.77 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి 71.96 శాతం నమోదయింది అని అధికారులు తెలిపారు. వేగేశ్వరపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సాధారణ ఎన్నికల పరిశీలకురాలు ఎం. గౌతమి సందర్శించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ లక్ష్మి లావణ్య ఉన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. కొవ్వూరు నియోజకవర్గంలో అన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట ద్విసభ్య కమిటీ నాయకులు జొన్నలగడ్డ చౌదరి, కంఠమని రామకృష్ణ, మద్దపట్ల శివరామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివప్రసాద్ తదితరులు ఉన్నారు. పోచవరం పంచాయతీ పరిధిలోని ఐదో నంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేయలేని వృద్ధులకు పోలింగ్ అధికారి సహకరించిన తీరుపై వివాదం నెలకొంది. వృద్ధుల వెంట సహాయకులను అనుమతించకుండా పోలింగ్ అధికారి స్వయంగా ఓటు వేయించారన్న ఆరోపణలతో కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎన్నికల సందర్భంగా సెక్షన్ 30, 144 ఆంక్షలు అమలులో ఉన్నప్పటికీ పెద్దేవం, తాళ్లపూడి, అన్నదేవరపేట, వేగేశ్వరపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల సమీపంలో జనసమూహాలు కనిపించాయి. 100 గజాల పరిధిలో ఆంక్షలు సక్రమంగా అమలు కాలేదని వైకాపా వర్గీయులు ఆరోపించారు. పోలీసుల ఆంక్షల కారణంగా అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు పలు గ్రామాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. తాళ్లపూడి మండలంలో కూటమికి వైకాపా, జనసేన రెబల్ అభ్యర్థులు కొన్ని స్థానాల్లో గట్టి పోటీ ఇచ్చారు. తాళ్లపూడి, గజ్జరం, పోచవరం, పెద్దేవం గ్రామాల్లో వైకాపా అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లకు నగదు, చీరలు, రవికల గుడ్డలు, బొట్టు, ప్రసాదం పంపిణీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీపీ, జెడ్పీటీసీ అభ్యర్థులు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి



తాళ్లపూడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ అభ్యర్థులు తమ ఓటు హక్కు ను వినియోగిం చుకున్నారు. ఎంపీపీ అభ్యర్థి నామా నాగ శంకర రాణి తన స్వగ్రా మం తాడిపూడిలోని పోలింగ్ కేంద్రం లో ఓటు వేశారు. జెడ్పీటీసీ అభ్యర్థి కొక్కిరిపాటి అనంతలక్ష్మి పెద్దేవం గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దివ్యాంగ ఓటర్లకు వీల్‌చైర్లతో సౌకర్యం

ఎన్నికల సందర్భంగా నడవలేని, కదలలేని ఓటర్లు తమ ఓటు హక్కును సులభంగా వినియోగించుకునేందుకు అధికారులు వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు. తాళ్లపూడి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లను వినియోగించుకుని దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేశారు. ఈ సౌకర్యం ఓటర్లకు ఎంతగానో ఉపయోగపడింది.

ఆకట్టుకునేలా తెలంగాణ ఇన్వెస్ట్ సమ్మిట్

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో సమ్మిట్
- రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, క్లైమేట్ కాంక్లేవ్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు
- సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులు వివరించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతినిధులు విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రతినిధులకు అందజేయాలన్నారు. సదస్సుకు వచ్చే ప్రముఖులు, అన్ని రంగాల ప్రతినిధులకు వేదికలోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సమ్మిట్‌లో ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితోపాటు భద్రతా అధికారిని నియమించాలని సీఎం సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందించాలన్నారు. నవంబర్ 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌తో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో ఒక ఎక్స్‌పో హాల్ ఉండగా ఈసారి ఆరు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ కార్యక్రమాలను రూపొందించారు. సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్‌ల ఏర్పాట్లను అధికారులు వివరించారు. రక్షా ఎక్స్‌పోలో రక్షణ, ఏరోస్పేస్, అంతరిక్షం, సైబర్ సెక్యూరిటీ రంగాలకు చెందిన ఆధునిక పరికరాలు, డ్రోన్లు, రోబోటిక్స్ ప్రదర్శించనున్నారు. వైమానిక విన్యాసాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు 575 సంస్థలను ఆహ్వానించగా, ఇప్పటివరకు 49 సంస్థలు ముందుకు వచ్చాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలకు సంబంధించి ఇండియా జాయ్--2026 నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి 136 స్టార్టప్‌ల ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్‌లో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు నవంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పెవిలియన్‌లో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకునేలా ప్రదర్శించాలన్నారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. 'నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు' తెలంగాణ విద్యారంగం ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్‌లో చర్చలు జరగాలని సీఎం సూచించారు. మూడు రోజుల సమ్మిట్‌లో నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. సమ్మిట్ నిర్వహణ కోసం 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 3,500 ఆహ్వానాలను పంపించారు. అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, వసతి, ప్రొటోకాల్, భద్రత, ప్రదర్శనల నిర్వహణ కోసం పది అధికారుల కమిటీలను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ సభ్యులుగా ఉన్న మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎం సూచించారు.

ఎల్‌నినో సవాళ్లపై తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్

ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు.

వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేకంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎం, డిప్యూటీ సీఎం తోపాటు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్
- పెద్దాపురం మహారాణి డిగ్రీ కళాశాలలో జడ్పిటీసీ,ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం లోని ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజాభూమి ప్రతినిధి,పెద్దాపురం

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం పెద్దాపురం మహారాణి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న కౌంటింగ్ కేంద్రంలోని ఏర్పాటులను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ,జిల్లా పరిషత్తు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల్లోని వసతులు, రీసెప్షన్ సెంటర్,మండలాల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలు, టేబుల్స్, సిట్టింగ్ అరేంజ్మెంట్స్,మీడియా పాయింట్ తదితర ఏర్పాట్లు పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ..లి జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 07న కౌంటింగ్ జరగనున్నాదన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి పెద్దాపురం డివిజన్ పరిధిలోని మండలాలకు పెద్దాపురం మహారాణి డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం సాయంత్రం వివిధ మండలాల వారీగా పోలింగ్ ప్రక్రియ ముగించు కుని రిసెప్షన్ సెంటర్ కు వచ్చే పోలింగ్ సిబ్బంది తీసుకువచ్చే పోలింగ్ సామాగ్రి,బ్యాలెట్ బాక్సులను సజావుగా స్ట్రాంగ్ రూములకు తరలించాలన్నారు.

ప్రతి మండలానికి స్ట్రాంగ్ రూమ్ పక్కనే కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూములు,కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ముందస్తు ఏర్పాట్లన్నీ వేగంగా పూర్తి చేయాలన్నారు.కౌంటింగ్ సిబ్బంది,పార్టీల ఏజెంట్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు అన్నిటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు.విద్యుత్తు, తాగునీరు,ఇతర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు.ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ జిల్లా ప్రజా పరిషత్తు సీఈవో వీవీవీఎస్.లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో డి.శ్రీలక్ష్మి, పెద్దాపురం ఎంపీడీవో సూర్యనారాయణ రావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి ప్రశాంతి

- ఆలమూరు, రావులపాలెం మండలాల్లో పోలింగ్ కేంద్రాల సందర్శన




ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి పి. ప్రశాంతి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలమూరు, రావులపాలెం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించారు. రావులపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆమె ఓటింగ్ సరళి, ఓటర్ల రాకపోకలు, సిబ్బంది విధుల నిర్వహణ, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ కొనసాగించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయ్యేలా ఎన్నికల, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో హార్టికల్చర్ జేడీ బి. రమణ, ఆలమూరు, రావులపాలెం తహసీల్దార్లు, ఎంపీడీవోలు కొసరాజు, ఎం.బి. ముక్తేశ్వరరావు, రాజు, వరసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాజులూరులో ప్రశాంతంగా ముగిసిన జెడ్పిటిసీ, ఎంపిటిసి పోలింగ్

- 66.98 శాతం పోలింగ్ నమోదు..
- కరుణించిన వరుణుడు ఉత్సాహంగా పాల్గొన్న ఓటర్



ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు

రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు జరిగిన పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు అందిన అధికారిక గణాంకాల ప్రకారం 66.98 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం మండల పరిధిలో 57,వేల 81 మంది ఓటర్లకు గాను 38, వేల 237 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు.మండల పరిధిలో 66 పోలింగ్ కేంద్రాల్లో 57,81మంది ఓటర్లకు గాను 38 వేల 237 ఓట్లు పోలై 66.98 శాతం నమోదు కాగా ఉదయం 9 గంటలకు 9.8 శాతం నమోదు కాగా పురుషులు 3,వేల 601 మంది, మహిళలు 1,953 మంది తమ తమ ఓటు హక్కును వినియోగించు కోగా, ఉదయం 11 గంటలకు 26.95%శాత పోలింగ్ నమోదై పురుషులు 8,వేల 660 మంది, మహిళలు 6,721 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు అలాగే మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 43.55% నమోదు కాగా పురుషులు 12,వేల 769మంది, మహిళలు 12,వేల 087 మంది తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మధ్యాహ్నం మూడు గంటల సమయానికి 52.22 శాతం నమోదు కాగా 15వేల 28 మంది పురుషులు, 14,వేల 778 మంది స్త్రీలు తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం ముగిసేసరికి 66.98% పోలింగ్ నమోదు కాగా మొత్తం 57,వేల 81 మంది ఓటర్లకు గాను 19,వేల 532 మంది పురుషులు, 18,705 మంది మహిళలు తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మొత్తం మీద మహిళలు కంటే పురుషులు 827 మంది అత్యధికంగా తమ తమ ఓటు హక్కును ఆయా చోట్ల వినియోగించుకున్నారు. దీంతో మండల పరిధిలో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే తొలుత మందకొడిగా సాగిన పోలింగ్ 10 గంటల తర్వాత పుంజుకోవడంతో పోలింగ్ ముగిసేసరికి మొత్తం 66.98 శాతం నమోదు అయ్యింది.

కరుణించిన వరుణుడు ఉత్సాహంగా పాల్గొన్న ఓటర్లు.

గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు గురువారం జరిగే పోలింగ్ కు ఏవిధంగా జరుగుతాదో అన్న మీమాంసలో రాజకీయ పార్టీలు నేతలు, అధికారులు ఉండగా ఊహించని విధంగా గురువారం ఎన్నికలకు వరుణుడు కరుణించడంతో. మండలంలో ఓటర్లు తమ ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. గొల్లపాలెం, కాజులూరులో ఓటు హక్కును వినియోగించు కున్న జడ్పిటిసి అభ్యర్థులు.

కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో వైకాపా జడ్పిటిసి అభ్యర్థిని దాకారపు జయప్రద తన ఓటు హక్కును వినియోగించుకోగా, మండల కేంద్రమైన కాజులూరులో జనసేన పార్టీ తరపున పోటీ చేసిన జడ్పిటిసి అభ్యర్థిని కోటి శేషారత్నం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రజాభూమి

కోనసీమ 5

శుక్రవారం 6 నవంబర్ 2026

మురుసు తుఫాన్ దెబ్బకు ధ్వంసమైన రహదారులు, పంట పొలాలు

రైతాంగానికి భారీ నష్టం!





ప్రజాభూమి ప్రతినిధి వేలేరుపాడు.

మురుసు తుఫాన్ దెబ్బకు వేలేరుపాడు మండలంలో రహదారులన్నీ పెద్ద మొత్తంలో ధ్వంసం కాగా రైతాంగానికి భారీ నష్టాన్ని మిగిల్చింది. మంగళ,బుధ వారాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, చెక్ డ్యాములు పెద్దవాగు రింగు బండు. తెగిపోవడంతో ఒక్కసారిగా వరద వేలేరుపాడు మండలం పై పడింది. దీనితో మండల కేంద్రానికి నాలుగు దిక్కుల రహదారి సౌకర్యం లేకుండా పోయింది. ప్రధాన రహదారులన్నీ పెద్ద పెద్ద గుంతల మయంగా మారడంతో, అశ్వరావుపేట, భద్రాచలం నుంచి వచ్చే వాహనాలన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులంతా రాత్రంతా రహదారులపై పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

పంటలకు భారీ నష్టం.

ఈ తుఫాను కారణంగా వాగులు వంకలు భారీగా పొంగి పొర్లడంతో పుత ఖాతా దశకు వచ్చిన మినుము, మిర్చి, కంది వంటి పంటలన్నీ వరద పాలై రైతాంగానికి భారీ నష్టాన్ని చేకూర్చింది. గతంలో ఎన్నడూ నవంబర్ నెలలో ఇంత పెద్ద ఎత్తున వాగులు పొంగిన దాఖలాలు లేవని, ఇదే ప్రథమంగా జరిగిందని రైతాంగం వాపోతోంది. ఈ తుఫాను పంట పొలాలను ధ్వంసం చేయటమే కాక వ్యవసాయ సామాగ్రిని గోదావరిలో కలిపిందని విలపిస్తున్నారు. పొలాల్లో రాము ఏర్పాటు చేసుకున్న ఇంజన్లు మోటార్లు,,పైపులు, డ్రమ్ములు, స్ప్రేయర్లు, డ్రిప్పు సామాగ్రి మొత్తం కొట్టుకుపోయాయని పేర్కొన్నారు. తొలకరి నుంచి ఎన్నో ప్రయాసాల కోర్చి పండించుకున్న పంటలు నోటికందే సమయంలో ఈ తుఫాను సర్వనాశనం చేసిందని బోరున విలపిస్తున్నారు. ఈ దశలో సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.







నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

ప్రజాభూమి, బుట్టాయిగూడెం

మురసు తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కన్వీనర్, రాష్ట్ర ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. పోలవరం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో మురసు తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలు, రహదారులను గురువారం బొరగం శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నష్టపోయిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుపాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధిత రైతులకు అండగా ఉంటామని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో 27 జడ్పీటీసీ స్థానాలు కూటమివే

- ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధీమా

ప్రజాభూమి ఏలూరు

జిల్లాలో జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధిస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.వట్లూరులోని జడ్పీ పాఠశాల పోలింగ్ కేంద్రంలో గురువారం ఉదయం 10.45 గంటలకు ఆయన సామాన్య ఓటరులా క్యూలో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ఒక జడ్పీటీసీ స్థానం టీడీపీకి ఏకగ్రీవం కాగా, మిగిలిన 26 స్థానాలను కూడా కూటమి కైవసం చేసుకుంటుందని అన్నారు.ఇటీవల జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలే ఈ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతోందని, ఎన్నికల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దౌర్జన్యాలపై ప్రజలు తిరగబడుతున్నారని, ఇప్పుడు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే తమ విజయానికి కారణమవుతాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ధ్వంసమైన ఆరు గంటల్లో ప్రారంభమైన మరమ్మత్తు పనులు





- హర్షం వ్యక్తం చేస్తున్న వేలేరుపాడు మండల ప్రజలు

ప్రజాభూమి ప్రతినిధి వేలేరుపాడు

మురుసు తుఫాన్ దెబ్బకు ధ్వంసమైన రహదారి పనులను ఆరు గంటల్లో ప్రారంభించటం తో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంత భారీ మొత్తంలో ధ్వంసమైన రహదారి పనులను తక్షణమే ప్రారంభించడం ఇదే ప్రథమంగా పేర్కొంటున్నారు. గతంలో ఎన్నడు విధ్వంసం జరిగాక నెలలు గడిచిన, ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్న పట్టించుకున్న దాఖలాలు లేవని, ఆ సమయంలో వాహనాలు నడవక ఎన్నో ఇబ్బందులు పడిన రోజులు ఉన్నాయని గుర్తు చేసుకుంటున్నారు. అటువంటిది కూటమి ప్రభుత్వం ధ్వంచమైన ఆరు గంటల్లోనే అనగా రాత్రి ఒంటిగంట వరకు వాగు ఉధృతి కొనసాగుతూనే ఉంది. తెల్లవారి ఏడు గంటలకి పనులు ప్రారంభించడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా ప్రజా సుపరిపాలన అందిస్తే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నడూ విస్మరించరని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విధంగా విధ్వంసం జరిగిన తక్షణమే మండలంలోని అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యాన్ని మరుసటి రోజు పునరుద్ధరించటం వింతగా ఉందని మరికొందరు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ప్రజల కష్టాలను గుర్తించి త్వరితగతిన పరిష్కార మార్గాలు చూపితే, ఆ ప్రభుత్వానికి ప్రజల అండదండలు వెన్నంటి ఉంటాయన్నది. ఈ విధమైన స్పందన ద్వారా రుజువు అవుతుందని మండల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కే

అత్యంత శక్తివంతమైన ఆయుధం

- మంత్రి పార్థసారథి




ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలోని ఈదర, బొద్దనపల్లి పంచాయతీ పరిధిలోని శోభనాపురం, ఆగిరిపల్లి, తోటపల్లి గ్రామాల్లో గురువారం మంత్రి కొలుసు పార్థసారథి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి పౌరుడు బాధ్యతగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి సమర్థవంతమైన స్థానిక నాయకత్వం అవసరమని, ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంబికా కృష్ణ,అంబికా రాజాలను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్ రెడ్డి అప్పలనాయుడు

ప్రజాభూమి ఏలూరు

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకులు అంబికా కృష్ణ, ఆయన సోదరులు అంబికా రాజాలను ఏలూరు నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడు గురువారం సాయంత్రం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి తరఫున అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆత్మీయంగా మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఏలూరు నగర అధ్యక్షులు వీరంకి పండు, నాయకులు రెడ్డి గౌరీశంకర్, ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, నగిరెడ్డి కాశీ నరేష్ పాల్గొన్నారు.



అక్రమాలకు, రీపోలింగ్‌కు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలి


- ఎన్నికల అధికారులకు మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశం

ప్రజా భూమి ప్రతినిధి, నూజీవీడు



నూజీవీడు మండలంలోని అన్నవరం, వెంకటాయపాలెం, సుంకొల్లు, రేగుంట, బోర్యంచ గ్రామాల్లో గురు వారం నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్ సరళిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లతో మాట్లాడి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. సుంకొల్లు పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన గందరగోళంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పోలింగ్‌కు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించాలని, ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తూ అక్రమాలకు, రీపోలింగ్‌కు తావులేకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, క్యూలైన్లలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు





- చివరి యాత్రలో పాల్గొని పాడె మోసిన మంత్రి నిమ్మల
- ప్రభుత్వ గౌరవం దక్కేలా సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక ఉత్తర్వులు

ప్రజాభూమి ప్రతినిధి , పాలకొల్లు

పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) మృతి పట్ల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాలకొల్లులో బుధవారం డాక్టర్ బాబ్జి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొని స్వయంగా పాడె మోసి తన అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. డాక్టర్ బాబ్జి వైద్య రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ విశిష్ట సేవలందించి ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఆయన మరణవార్తను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ బాబ్జి సేవలకు తగిన గౌరవం దక్కాలనే ఉద్దేశంతో ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించేలా అప్పటికప్పుడు ప్రత్యేక అనుమతి ఉత్తర్వులు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. దీంతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ప్రముఖ వైద్యునిగా, ప్రజాప్రతినిధిగా ఆయన అందించిన సేవలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని మంత్రి నిమ్మల అన్నారు. డాక్టర్ బాబ్జి వంటి విశిష్ట వ్యక్తికి గౌరవం ఇవ్వడం అంటే మనల్ని మనం గౌరవించుకున్నట్లేనని పేర్కొన్నారు. అధికారులు,వేలాది మంది అభిమానులు మధ్య డాక్టర్ బాబ్జి అంత్య క్రియలు ఘనంగా జరిగాయి.



ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికలు ప్రశాంతం

ప్రజా భూమి కుక్కునూరు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కుక్కునూరు మండలంలో గురువారం ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల పోరు ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 32 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. కాగా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.మండలంలో 10 ఎంపీటీసీ,ఒక జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

జిల్లాలో 27 జడ్పీటీసీ స్థానాలు కూటమివే

- ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధీమా



ప్రజాభూమి ఏలూరు

జిల్లాలో జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధిస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. వట్లూరులోని జడ్పీ పాఠశాల పోలింగ్ కేంద్రంలో గురు వారం ఉదయం 10.45 గంటలకు ఆయన సామాన్య ఓటరులా క్యూలో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.అనంతరం మీడియా తో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ఒక జడ్పీటీసీ స్థానం టీడీపీకి ఏకగ్రీవం కాగా, మిగిలిన 26 స్థానాలను కూడా కూటమి కైవసం చేసుకుంటుందని అన్నారు.ఇటీవల జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలే ఈ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతోందని, ఎన్నికల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దౌర్జన్యాలపై ప్రజలు తిరగబడుతున్నారని, ఇప్పుడు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని పేర్కొన్నా రు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే తమ విజయానికి కారణమవుతాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శుక్రవారం 06 నవంబరు 2026

పాటువిధి నిర్వహణలో జర్నలిస్టుపై పోలీసుల దాడి దారుణం

- సీఐ దురుసు ప్రవర్తనను ఖండించిన జర్నలిస్టు సంఘం
- బాధ్యుడైన సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్
- చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

చిత్తూరు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వార్తల సేకరణకు వెళ్లిన వీకోట ఎన్టీవీ రిపోర్టర్ అక్రమ్‌పై పోలీసు అధికారి దాడికి యత్నించిన ఘటనను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఓటు వేసేందుకు వెళుతున్నామని చెప్పినా వినకుండా సీఐ స్థాయి అధికారే రిపోర్టర్‌పై దాడికి తెగబడటం అత్యంత దారుణమని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు శివరామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి షబ్బీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టు అని తెలిసినా కనీస విచక్షణ లేకుండా వ్యవహరించడం పోలీసు వ్యవస్థకే మాయని మచ్చ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వారిపై దాడులకు యత్నించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదన్నారు. ప్రజా సమస్యలను, ఎన్నికల పరిణామాలను ప్రజల ముందుకు తీసుకెళ్లే బాధ్యత జర్నలిస్టులపై ఉందని, అటువంటి విధి నిర్వహణకు ఆటంకాలు కలిగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

ఎన్నికల వార్తల సేకరణ జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కు అని, ఆ హక్కును అడ్డుకునే అధికారం ఎవరికీ లేదన్నారు. కొంతమంది పోలీసు అధికారుల అత్యుత్సాహం, అహంకారపూరిత వైఖరి కారణంగా పోలీసు శాఖ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని విమర్శించారు. విధి నిర్వహణలో ఉన్న విలేకరుల పట్ల నియమనంతో వ్యవహరించాల్సిన అధికారులు, అందుకు విరుద్ధంగా దాడులకు ప్రయత్నించడం ఆందోళనకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వి. కోట ఎన్టీవీ రిపోర్టర్ అక్రమ్‌పై జరిగిన ఘటనను ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని కోరారు. జర్నలిస్టులపై దౌర్జన్యాలకు పాల్పడే అధికారుల విషయంలో ఫెడరేషన్ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకోని పక్షంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని శివరామకృష్ణ, షబ్బీర్ హెచ్చరించారు.

సిబ్బందికి భోజనం కూడా లేదా..? అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే..!

ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి కనీన వనతులు కల్పించాలని నూచన



ప్రజా భూమి నార్పల

నార్పల మండలంలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి కనీస వసతులు కల్పించకపోవడంపై ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి కనీసం భోజన సదుపాయాలు కూడా సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంపై ఎంపీడీవోతో పాటు ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. ఎన్నికల విధుల్లో నిరంతరం పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేయకూడదని స్పష్టం చేశారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడం కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

గడ్డంనాగేపల్లిలో ప్రశాంతంగా పోలింగ్.. ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు!

ప్రజా భూమి నార్పల

నార్పల మండలంలోని గడ్డంనాగేపల్లి గ్రామంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ జి. సాగర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఏఎస్ఐ భీమ్లా నాయక్ సైతం బందోబస్తు విధుల్లో పాల్గొని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.గ్రామంలో మొత్తం 1,750 ఓట్లు ఉండగా, 1,467 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 83.83 శాతం పోలింగ్ నమోదైంది. మరో 283 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. పోలింగ్ సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు సహకరించిన ఎస్ఐ సాగర్, ఏఎస్ఐ భీమ్లా నాయక్‌తో పాటు పోలీసు సిబ్బందికి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల విధుల్లో పోలింగ్ అధికారి హరిత మృతి పట్ల ఎంపీ అంబిక విచారం

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం జిల్లా కూడేరు మండలం కడదరిగుంట గ్రామంలో పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురైన పోలింగ్ అధికారి హరిత మృతి చెందడంపై అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ విచారం వ్యక్తం చేశారు. హరిత (58) ఏపీవోగా విధులు నిర్వర్తిస్తున్న హరిత గౌడకు గుండెపోటు వచ్చింది. దీంతో కూడా ఆస్పత్రికి తరలిస్తుండగా దారి మధ్యలోనే మృతి చెందారు. అనంతపురం జిల్లా డి.హీరాహాల్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆమె కూడేరు మండలం, కడదరగుంట గ్రామంలో పోలింగ్ కేంద్రంలో విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో శ్వాస సంబంధిత సమస్య తలెత్తడంతో పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య బృందం వెంటనే ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ అత్యవసర వైద్య చికిత్స అందించినప్పటికీ గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు ఆమె మరణించారు. హరిత మృతి పట్ల ఎంపీ అంబిక ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరిత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

రాప్తాడు, ప్రసన్నాయపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలను సమీక్షించిన జిల్లా ఎస్పీ

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలపై నిశిత పరిశీలన పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు మరియు అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఓటర్ల క్యూలైన్ మెయింటెనెన్స్, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు వెళ్తున్న తీరును పరిశీలించిన జిల్లా ఎస్పీ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు చేశారు. ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట భద్రతా చర్యలు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని అధికారులకు జిల్లా ఎస్పీ సూచనలు చేశారు.



ప్రశాంతంగా ప్రాదేశిక ఎన్నికలు-రూరల్‌లో 84.24 శాతం పోలింగ్ నమోదు

-గోళ్లాపురంలో స్వల్ప ఉద్రిక్తత -పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండలంలో గురువారం నిర్వహించిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక ఎన్నికల్లో 84.24 శాతం పోలింగ్ నమోదైంది. మండల పరిధిలోని 15 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా, మొత్తం 43,155 మంది ఓటర్లకు గాను 84.24 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు మండల ఎన్నికల అధికారి శివానంద నాయక్, ఎంపీడీవో దామోదరమ్మ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగినట్లు వెల్లడించారు. ప్రాదేశిక ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, పార్టీ ముఖ్య నాయకుడు వేణురెడ్డి ఎం. బీరేవల్లి మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారు ఓటు వేశారు. అయితే గోళ్లాపురంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి





ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, వేణురెడ్డి ఎన్నికల సరళిని పరిశీలించేందుకు గ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలో కొంతమంది దీపికను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఆంజనేయులు మండల వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందిని మోహరించడంతో పాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచారు. స్వయంగా సిబ్బందితో కలిసి పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ ఎన్నికల నిర్వహణలో డిప్యూటీ ఎంపీడీవోలు శివకుమార్, నారాయణతో పాటు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి కనీస వసతులు కల్పించాలి..!

అధికారుల తీరుపై ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అసహనం

పోలింగ్ కేంద్రాల పరిశీలన.. సిబ్బంది సమస్యలపై ఆరా..

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పిలుపు

ప్రజా భూమి నార్పల



నార్పల మండలంలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడి వారికి కల్పించిన వసతులు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బందికి కనీసం భోజన సదుపాయాలు కూడా సక్రమంగా కల్పించకపోవడంపై ఎమ్మెల్యే అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎంపీడీవోతో పాటు సంబంధిత ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి అవసరమైన కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయకూడదని స్పష్టం చేశారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే భోజనంతో పాటు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ తీరుపై అధికారులతో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడం కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పిలుపునిచ్చారు.

కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కువినియోగించుకున్న -ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజాభూమి శింగనమల



బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం గ్రామంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యవ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే ప్రతి ఓటు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగాఓటు వేయాలని ఆమె సూచించారు.



పుట్లూరు మండల కేంద్రంలో ప్రశాంతంగా జరిగిన ఎన్నికలు

ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండల కేంద్రంలో గురువారం ఎంపీటీసీ మరియు జెడ్పీటీసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం జరిగినది. నిన్నటి వరకు జరిగినఎన్నికల ప్రచారం నువ్వా నేనా అన్న అన్న పద్ధతిలో ప్రచారం నిర్వహించడం జరిగినది. అయితే గురువారం మాత్రం అందుకు భిన్నంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గొడవలు లేకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగినది. మొత్తం పుట్లూరు మండల వ్యాప్తంగా 11 ఎంపీటీసీ





స్థానాలు ఒక జడ్పిటిసి స్థానానికి ఎన్నికల నిర్వహించారు. మొత్తం ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికలలో 20,788 ఓట్లు పోలవగా అందులో పురుషులు 11617 మంది, మహిళలు 9171 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మండల వ్యాప్తంగా 66. 62607% నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మండలాల్లో 80 శాతం తగ్గని పోలింగ్

-ఓటు హక్కు వినియోగించుకున్న దీపిక

-గెలుపు పై ఎవరి ధీమా వారిదే..

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో పోలింగ్ 80% తగ్గలేదు. మండలాల్లోనూ 80 శాతానికి మించి పోలింగ్ నమోదు కావడంతో గెలుపు పై ప్రధాన కూటమిపార్టీ, వైకాపాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. చిలమత్తూరు షాక్ మండలంలో 82.66% పోలింగ్ నమోదు కాగా లేపాక్షి మండలంలో 81.57%, హిందూపురం రూరల్ మండలంలో 84.24% పోలింగ్ నమోదయింది. ఉదయం నుండే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. హిందూపురం రూరల్ మండల పరిధిలోని కొటిపి పోలింగ్ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ జడ్పిటిసి అభ్యర్థి భాగ్యలక్ష్మి అరుణాచల్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, ఆమె భర్త గుడ్డంపల్లి వేణు రెడ్డి వేణురెడ్డి ఎం.బీరేపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనికి తోడు చిలమత్తూరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రంగారెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని మండలాలలోనూ 80 శాతానికి పైబడి పోలింగ్ నమోదు కావడంతో ప్రభుత్వ వ్యతిరేకత తమకు ఎంతో అనుకూలిస్తుందని వైకాపా గెలుపుపై నమ్మకం పెట్టుకోగా కూటమిపార్టీ గత రెండు సంవత్సరాలుగా చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ ఓటు రూపంలో రుణం తీర్చుకుంటున్నారని కూటమి పార్టీ నేతలు గెలుపు పై ధీమాతో ఉన్నారు. అయితే ఎవరి ధీమా ఏ మేరకు ఉంటుందో ఫలితాలు వెలువడే వరకు వేచి చూడాల్సిందే.



ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శుక్రవారం 06 నవంబరు 2026

పులివెందుల జడ్పీటీసీ పోరులో రణరంగం

ఆరు పంచాయతీల్లో ప్రశాంతంగా మొదలై ఉద్రిక్తంగా ముగిసిన పోలింగ్

పెట్రోలు బాంబులు, రాళ్ల దాడులు, మహిళల కట్టెల దాడి, పోలీసుల లాఠీచార్జ్‌తో దద్దరిల్లిన గ్రామాలు





ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మండల పరిధిలోని ఆరు పంచాయతీల్లో బుధవారం జరిగిన జడ్పీటీసీ ఎన్నికలు కొన్ని చోట్ల ప్రశాంతంగా సాగగా, మరికొన్ని గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో ఎక్కడ చూసినా పోలింగ్ సందడి, మరోవైపు ఘర్షణ వాతావరణం కనిపించింది. ఓటు వేయాలని వచ్చిన ఓటర్లు ఒకవైపు, తమ ఆధిపత్యం చాటుకోవాలని ప్రయత్నించిన వర్గాలు మరోవైపు ఉండటంతో పలు గ్రామాలు రణరంగంగా మారాయి. ఉదయం ఆరు గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. వృద్ధులు, మహిళలు, యువత అందరూ ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యారు. మొదటి రెండు మూడు గంటల పాటు అన్ని గ్రామాల్లోనూ పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పోలీసులు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించి భద్రతా ఏర్పాట్లు చేశారు. నల్లగొండవారి పల్లె లో ఓటర్లు ఎలాంటి గొడవలు లేకుండా, ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడ ప్రజలు క్రమశిక్షణతో క్యూలైన్లలో నిలబడి ఓటు వేసి వెళ్లిపోయారు. అయితే ఉదయం ప్రశాంతంగా సాగిన పోలింగ్ మధ్యాహ్నానికి పలు గ్రామాల్లో ఘర్షణలకు దారితీసింది. మధ్యాహ్నం అయ్యేసరికి బయట వ్యక్తులు గ్రామాల్లోకి రావడం, ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు, అడ్డుకోవడాలు మొదలవడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. గ్రామాల్లో చిన్న చిన్న వాగ్వాదాలు మొదలై కాసేపటికే పెద్ద ఘర్షణలుగా మారాయి.

నల్లపురెడ్డిపల్లెలో భారీ ఉద్రిక్తత

నల్లపురెడ్డిపల్లె గ్రామంలో జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ సజావుగా సాగింది. అయితే మధ్యాహ్నం గ్రామంలోకి కొత్త వ్యక్తులు సంచరించడంతో గ్రామస్తులు ఎదురుతిరిగారు. మా గ్రామంలోకి బయటి వారు ఎందుకు వస్తున్నారు, ఓటర్లను ఎందుకు భయపెడుతున్నారు అంటూ గ్రామస్తులు ప్రశ్నించారు. దీంతో వాగ్వాదం చెలరేగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు చెందిన వాహనం ధ్వంసమైంది. వాహనం అద్దాలు పగిలిపోయాయి. గ్రామంలో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది.సమాచారం అందుకున్న పోలీసులు భారీగా చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు గ్రామంలో మార్చి నిర్వహించి, ఇరువర్గాలను హెచ్చరించారు. దీంతో పోలింగ్ సజావుగా ముగిసింది. అయినా సాయంత్రం వరకు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగింది.

ఎర్రిపల్లెలో పెట్రోలు బాంబుల మోత...
కట్టెలతో మహిళల ఎదురుదాడి

ఎర్రిపల్లె గ్రామంలో తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య భారీ ఘర్షణ చోటుచేసుకుంది. రాళ్లు, కర్రలు, పెట్రోలు బాంబులతో పరస్పరం దాడులకు దిగినట్లు సమాచారం. ఒక్కసారిగా పెట్రోలు బాంబులు పేలడంతో గ్రామమంతా దద్దరిల్లింది. రాళ్ల వర్షం కురవడంతో గ్రామస్తులు ఇళ్లలోకి పరుగులు తీశారు.బయట వ్యక్తులు గ్రామంలోకి చొరబడి ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మా ఓట్లు మేము వేసుకుంటాం, మమ్మల్ని ఎవరూ అడ్డుకోవద్దంటూ గ్రామస్తులు గట్టిగా నిలబడ్డారు. ఈ క్రమంలో మహిళలు సైతం కట్టెలు చేతబట్టి ఎదురుతిరిగారు. మహిళలు కట్టెలతో ముందుకు రావడంతో అక్కడ ఉన్న వారు ఒక్కసారిగా వెనక్కి తగ్గారు. గ్రామస్తులు ఏకమవడంతో తెలుగుదేశం వర్గాలు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు. గ్రామం కోసం అందరూ ఒక్కటయ్యారు, ఆడవాళ్లు కూడా ధైర్యంగా ముందుకు రావడంతో బయటి వ్యక్తులు పారిపోయారని గ్రామస్తులు చెప్పారు. ఈ ఘటనతో ఎర్రిపల్లెలో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయినా, తర్వాత పోలీసుల పర్యవేక్షణలో తిరిగి కొనసాగింది.

ఆర్. తుమ్మలపల్లెలో ఘర్షణ...
గాయపడిన కార్యకర్త

ఆర్. తుమ్మలపల్లె గ్రామంలో తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో గంగాధర్ రెడ్డి చేతికి గాయాలయ్యాయి. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాటకు దారితీసింది. ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది.మోట్నూతపల్లె గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆందోళనకు దిగారు. చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ పోలింగ్ కొనసాగింది. పోలింగ్ ఆగిపోకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

పలుచోట్ల పోలీసుల లాఠీచార్జ్...
ఓటర్ల ఆరోపణలు

పోలీసులు ఓటర్లపై పలుచోట్ల లాఠీచార్జ్ చేసినట్లు ఓటర్లు ఆరోపించారు. ఇరువర్గాలు భారీగా మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి చేజారిపోతుందని భావించిన పోలీసులు లాఠీచార్జ్ చేసి గుంపులను చెదరగొట్టారు. నల్లపురెడ్డిపల్లెలో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. మోటు నూతవల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారంటూ గ్రామస్తులు పోలీసు వాహనానికి అడ్డంగా నిలబడటం తో పోలీసులు లాఠీచార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు. దీంతో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయని చెబుతున్నారు.మొత్తంగా చూస్తే పులివెందుల మండలంలో జడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగలా జరగాల్సి ఉండగా, పలు గ్రామాల్లో ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారాయి. అయినా ఓటర్లు మాత్రం భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా గ్రామాల్లో పోలీసు బందోబస్తు కొనసాగింది.

చెమ్మర్తి సుబ్బరాజు మృతికి ఒంటిమిట్ట టీడీపీ నాయకుల నివాళులు



ప్రజాభూమి, ఒంటిమిట్ట: రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చెమ్మర్తి జగన్మోహన్ రాజు తండ్రి చెమ్మర్తి సుబ్బరాజు గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట మండల టీడీపీ సీనియర్ నాయకులు రాయచోటి పట్టణంలోని రాజు విద్యాసంస్థల ప్రాంగణానికి చేరుకుని సుబ్బరాజు భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గతంలో సుబ్బరాజుతో తమకున్న అనుబంధాన్ని ఆయన మనవడు లోకేష్ రాజుతో పంచుకున్నారు. సుబ్బరాజు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర మాజీ డైరెక్టర్, ఒంటిమిట్ట మండల టీడీపీ సీనియర్ నాయకులు కొమర వెంకట నరసయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, పామూరు సుబ్రహ్మణ్యం, గంగపేరూరు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

టక్కోలులో జోరుగా.. పొన్నవోలులో మందకొడిగా ఎంపీటీసీ పోలింగ్

టక్కోలు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలంలోని పొన్నవోలు, టక్కోలు ఎంపీటీసీ స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో టక్కోలు పరిధిలో అధిక పోలింగ్ నమోదు కాగా, పొన్నవోలులో పోలింగ్ మందకొడిగా సాగింది. రెండు ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. టక్కోలు ఎంపీటీసీ పరిధిలోని నాలుగు కేంద్రాల్లో 3,745 ఓట్లకు గాను 2,630 ఓట్లు పోలయ్యాయి. పొన్నవోలు పరిధిలో 2,693 ఓట్లకు గాను 1,195 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. పి.కొత్తపల్లి 27వ పోలింగ్ కేంద్రంలో 755 ఓట్లకు గాను 350 ఓట్లు పోలై 46.3 శాతం నమోదైంది. పొన్నవోలు ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి జ్యోతి శివారెడ్డి, వైసీపీ అభ్యర్థి సౌరెడ్డి విజయలక్ష్మి మధ్య పోటీ నెలకొనగా, టక్కోలు స్థానంలో స్వతంత్ర అభ్యర్థులు సింగం పద్మావతి, బత్తెన లక్ష్మీదేవి పోటీపడ్డారు. టక్కోలు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని కడప ఆర్డీవో మురళి సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అధికార దుర్వినియోగంతోనే ఎన్నికలు... రీపోలింగ్ జరపాల్సిందే

ఏజెంట్లను బూతుల్లోకి రానివ్వలేదు-ఏజెంట్ ఫారాలను చించేశారు

పోలీసులు కూటమికి సహకరించారు-మహిళలపైనా దౌర్జన్యం : ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల :

అధికార దుర్వినియోగంతో కూటమి నాయకులు ఎన్నికలు నిర్వహించారని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు. గురువారం జగన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. మా ఏజెంట్ల ఏజెంట్ ఫారాలను బయట వ్యక్తులు దౌర్జన్యంగా చించి వేశారని, ఏజెంట్లను బూతుల్లోకి కూడా వెళ్లనివ్వకుండా కూటమి నాయకులు అడ్డుకున్నారని, పోలీసులు పూర్తిగా వారికే సహకరించారని ఆయన మండిపడ్డారు.మా జడ్పీటీసీ అభ్యర్థులు నామినేషన్లు వేసిన చోట్ల తప్పనిసరిగా రీపోలింగ్ జరపాలని అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు. బయట వ్యక్తులు వచ్చి పోలీసుల ముందరే యథేచ్ఛగా రీ పైక్లింగ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అచ్చువెల్లి, ఎర్రిపల్లె గ్రామాల్లో మహిళలు చూస్తుండగానే పోలీసులు ఇష్టానుసారం బూతులు మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి పోలీసు వ్యవస్థను తాను ఎప్పుడూ చూడలేదన్నారు. వేముల మండలం, లింగాల మండలం, పులివెందుల మండలంలోని బూతుల్లో రీపోలింగ్ జరపాలన్నారు. ఈ బూతుల్లో పూర్తిగా బయట వ్యక్తులతో సైక్లింగ్ పద్ధతిలో ఓట్లు వేయించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేయడానికి వస్తే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు.ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేయకుండా అడ్డుకుంటు న్నారని, మా ఓట్లు మేము వేసుకుంటామన్నా పోలీసులు వారిని వెళ్లనివ్వకుండా చేయడం దారుణమన్నారు. నామినేషన్లు వేసేప్పటి నుంచి ప్రతి ఒక్క విషయంలో నూ కూటమి నాయకులు అడ్డుకుంటున్నార న్నారు. నామినేషన్ వేసిన వారిని న్యూటీలో ఎత్తివేయడం జరిగిందన్నారు.ఇలా దౌర్జన్యాలు చేసుకుంటూ పోతే ఎంతకాలం సాగుతుందని అవినాష్ రెడ్డి ప్రశ్నించారు. కూటమి నాయకులు బయట నుంచి పిలుచుకొచ్చిన వ్యక్తులపై వారికే నమ్మకం లేక, ఓట్లు వేయడానికి లోపలికి వెళ్లినప్పుడు వాళ్ల ఓట్లు వాళ్లే వేసుకుంటున్నారన్నారు. అంటే బయట వ్యక్తులు వారికి ఓటు వేస్తారో లేదో అన్న అనుమానం వారికే ఉందన్నారు. తెలుగుదేశం మూకలు చేసిన దాడుల్లో మా వారికి చాలామందికి గాయాలయ్యాయన్నారు. ఒక పత్రిక విలేకరి వార్తను కవర్ చేయడానికి వెళితే అతన్ని కూడా కొట్టడం జరిగిందన్నారు. మహిళల మెడలలోని గొలుసులు కూడా లాక్కునే పరిస్థితికి వచ్చారన్నారు. అక్రమ కేసులు పెట్టి మా నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం జరిగిందన్నారు. ముందు రోజు ఉదయం నుంచే నాయకులను తీసుకువెళ్లి పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టుకున్న పరిస్థితి నెలకొందన్నారు. తాను అక్కడికి వెళ్లి పోలీసులను అడిగితే ఎన్నికలు అయిపోయిన తర్వాత సాయంత్రం వదిలిపెడతామని చెప్పడం జరిగిందన్నారు. పార్నపల్లెలో ఏజెంట్లను వెళ్లనివ్వకుండా ఉంటే తాను అక్కడికి వెళ్లి పోలీసులతో మాట్లాడితే, మీరు వెళ్లండి మేము పంపిస్తామని చెప్పి వారిని లోపలికి పంపించి, గంటకే మళ్లీ బయటికి పోలీసులు పంపించిన దుస్థితి నెలకొందన్నారు. ఎక్కడ చూసినా కూటమి నాయకులు అరాచకాలు చేసి ఓట్లు వేసుకోవడం జరిగిందన్నారు. పులివెందుల మండలానికి సంబంధం లేని వ్యక్తులు బూతుల్లోకి వెళ్లి ఓట్లు వేస్తూ ఉంటే పోలీసులు వారికి సహకరించి సినిమా చూస్తున్నారే తప్ప, వారిని మందలించిన పాపాన పోలేదన్నారు. ఒరిజినల్ ఓటర్లు లోపలికి వెళుతూ ఉంటే వారిని మాత్రం లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. వేములకు సంబంధించి అక్కడే ఉన్న జిల్లా ఎస్పీకి చరవాణి ద్వారా తెలిపితే, మా ఎస్ఐకి చెప్పాము, ఆయనతో మాట్లాడండి అని చెప్పడం జరిగిందన్నారు. ఇక్కడ జరిగిన అన్యాయాలను, దౌర్జన్యాలను రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. వేముల, పులివెందుల, లింగాల మండలాల్లో కచ్చితంగా రీపోలింగ్ జరిగే విధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని అవినాష్ రెడ్డి తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కూటమి నేతలు

- ఎన్నికల సరళిని సమీక్షించిన టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె

గురువారం వేంపల్లె మండలంలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. కూటమి నాయకులతో కలిసి స్థానిక పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల, భారతి పాఠశాల తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సరళిని సమీక్షించారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూతమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి బలమని అన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, మహమ్మద్ షబ్బీర్, టిడిపి యువ నాయకుడు సింగారెడ్డి శివకృష్ణారెడ్డి (బుజ్జి), నామా వేమకుమార్, ఎద్దుల శేషారెడ్డి, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త దాసరి రవిశంకర్, బీజేపీ నాయకురాలు పెడబల్లి సుష్మ, సింగారెడ్డి ఆదిత్యారెడ్డి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది

- ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జయరామి రెడ్డి సతీమణి, 9వ ఎంపీటీసీ సింగారెడ్డి రాధమ్మ, తనయుడు, టిడిపి యువ నాయకుడు సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి (బుజ్జి)తో కలిసి కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. అనంతరం సింగారెడ్డి జయరామి రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.

ఫ్యాక్షన్ రాజకీయాలకు కూటమి సర్కార్ ఆజ్యం

ఒకరికి స్వేచ్ఛ... మరొకరికి ఆంక్షలా? : రెడ్యం



ప్రజాభూమి, పులివెందుల :

రాయలసీమలో కనుమరుగైన ఫ్యాక్షన్ సంస్కృతిని కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రోత్సహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఆరోపించారు.కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని గురువారం ఉదయం అరెస్టు చేసి వైఎస్ జగన్ పులివెందుల క్యాంపు కార్యాలయానికి తరలించిన నేపథ్యంలో ఆయనతో రెడ్యం భేటీ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.పార్నపల్లెలో బీటెక్ రవితో పాటు ఇతర ప్రాంతాల తెలుగుదేశం నాయకులు ఉన్నా వారిని పంపకుండా, పరిస్థితి చూడటానికి వెళ్లిన ఎంపీని డీఎస్పీ బుక్కే మురళీనాయక్ అడ్డుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.పోలింగ్ ఏజెంట్లను బూతుల్లోకి రానివ్వకపోవడం, ఓటర్లను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని అన్నారు. ఎన్నికల సంఘం, పోలీసులు తెలుగుదేశంతో కుమ్మక్కయ్యారన్న జగన్ వ్యాఖ్యలు నిజమవుతున్నాయన్నారు. జిల్లా ఎస్పీ ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, కంచె చేను మేసిన చందంగా పోలీసులే ఎన్నికల ప్రక్రియను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఓటర్లు భయపడకుండా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు తప్పక పాటించాలి : డాక్టర్ ఖాజా మొనుద్దీన్



ప్రజాభూమి, పులివెందుల :

ఆడపిల్లల హక్కులను పరిరక్షిస్తూ, లింగ వివక్షను నిర్మూలించేందుకు పి సి, పి ఎన్ డి టి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ ఖాజా మొనుద్దీన్ సూచించారు. గురువారం పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆయన ఆధ్వర్యంలో సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, లింగ ఎంపికకు ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఆసుపత్రి సూపరింటెండెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీకాంత మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్షను తొలగించి సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఆర్ ఎం ఓ డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు చట్ట నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని, ప్రభుత్వ శాఖలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి బాలికల హక్కులను పరిరక్షించాలని పేర్కొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శుక్రవారం 06 నవంబరు 2026

ప్రశాంతంగా ముగిసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్..

బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత నడుమ కౌంటింగ్ కేంద్రాలకు తరలింపు
జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. గురువారం ఎస్.ఆర్.పురం జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించి పోలింగ్ ముగింపు సందర్భంగా ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో బ్యాలెట్ బాక్సులను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రత నడుమ సంబంధిత ఓట్ల లెక్కింపు కేంద్రాలకు తరలించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బంది నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ బ్యాలెట్ బాక్సుల తరలింపు ప్రక్రియను జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఈ క్రింది విధంగా ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు.

రేణిగుంట పోలింగ్ బూత్ లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

ప్రజా భూమి ప్రతినిధి
రేణిగుంట.



తిరువతి జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసి, ఎంపీటీసి ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా తిరువతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు రేణిగుంట పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు తీసుకున్న భద్రతా చర్యలను ఆయన పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలను మోహరించామని, ప్రజలు ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు.

శ్రీనివాస మంగాపురంలో వైభవంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు ప్రారంభం..!

ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:



చంద్రగిరి మండలం, శ్రీనివాస మంగాపురంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నిన్న సాయంత్రం శాస్త్రోక్తంగా నిర్వహించిన అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి.



ఉత్సవాల విశేషాలు – ప్రాశస్త్యం: పవిత్ర ప్రతిష్ఠ: మొదటి రోజైన నేడు యాగశాలలో వైదిక క్రతువులు నిర్వహించి, రాత్రి వేళ ఆగమోక్తంగా 'పవిత్ర ప్రతిష్ఠ' చేపట్టనున్నారు. స్నపన తిరుమంజనం: ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అర్చకులు విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పవిత్ర సమర్పణ: రెండో రోజైన శుక్రవారం (నవంబర్ 6) మధ్యాహ్నం స్వామివారికి పట్టుతో చేసిన పవిత్రమాలలను సమర్పించనున్నారు. అదే రోజు సాయంత్రం శ్రీవారి వీధి ఉత్సవం వైభవంగా జరగనుంది. పూర్ణాహుతితో ముగింపు: చివరి రోజైన శనివారం (నవంబర్ 7) రాత్రి యాగశాలలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించడంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తమవుతాయి. ఆలయంలో ఏడాది పొడవునా అర్చకులు, భక్తుల ద్వారా తెలిసీ తెలియక జరిగే దోషాలు, లోపాలను నివారించి ఆలయ పవిత్రతను కాపాడేందుకు ఆగమశాస్త్రోక్తంగా ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌లో ఎన్నికల సరళిని పరిశీలించిన దండి నరేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు



శ్రీ కాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండల పరిధిలోని చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌కు సంబంధించి శివనాధపాలెం, శివనాధపురం, కారాకొల్లు, చిటత్తూరు గ్రామాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలను జనసేన పార్టీ శ్రీ కాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర సందర్శించి, పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ అంతటా పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా కొనసాగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగియడంతో ఎన్నికల అధికారులు తగిన భద్రతా ఏర్పాట్ల మధ్య పోలింగ్ అనంతర విధివిధానాలను చేపట్టారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న నేపథ్యంలో, చిటత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్ జనసేన పార్టీ అభ్యర్థి యానాది మణికి ప్రజల ఆశీస్సులతో అనుకూలమైన తీర్పు లభిస్తుందని జనసేన నాయకులు, శ్రీ కాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పార్టీ శ్రేణులు చూపిన సమిష్టి కృషి, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర మద్దతు అభినందనీయమని పేర్కొంటూ, పార్టీ బలోపేతానికి ఐకమత్యంతో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత పర్యావరణమే లక్ష్యం - ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్లాస్టిక్ రహిత పర్యావరణంపై అవగాహన కార్యక్రమంనిర్వహించారు. సుస్థిర జీవన శైలి అంశముపై చేపట్టిన వారోత్సవాల్లో భాగంగా గురువారంప్లాస్టిక్ నిర్మూలన పై వాహనదారులు మరియు కార్యాలయ సిబ్బందితో జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అత్యవసరమని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ పేర్కొన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన లిప్లాస్టిక్ రహిత పర్యావరణ ప్రతిజ్ఞ కార్యక్రమంలోలి ఆయన మాట్లాడుతూ, విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు మానవ ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పు ఏర్పడుతోందని అన్నారు. ముఖ్యంగా ఒక్కసారి మాత్రమే ఉపయోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్ నకు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హిత వస్తువులను వినియోగించాలని కోరారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, కప్పులు, ప్లేట్లు, స్ట్రాల వినియోగాన్ని తగ్గించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసినట్లుగానే ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా బాధ్యతాయుతంగా వేరు చేసి రీసైక్లింగ్‌కు అందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచే పర్యావరణ పరిరక్షణకు ఆదర్శవంతమైన మార్పు ప్రారంభం కావాలి. ప్రతి ఉద్యోగి తన వ్యక్తిగత జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. చిన్న చిన్న మార్పులే పెద్ద సామాజిక మార్పులకు పునాది అవుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా రవాణా శాఖ అధికారులు, సిబ్బంది అందరూ ప్లాస్టిక్ రహిత పర్యావరణ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన అధికారి అతికానాజ్, స్వర్ణలత పరిపాలన అధికారులు విజయ్ కుమార్, విజయ ప్రశాంతి తదితర అధికారులు మరియు వాహనదారులుపాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల్లో స్థానిక భవితవ్యం: చంద్రగిరి మండలంలో 72.94% పోలింగ్ నమోదు.. ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల సమరం!

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసిన పోలింగ్ ప్రక్రియ
చంద్రగిరి మండలంలో 11 ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ముగిసిన ఓటింగ్.. 5 ఎంపీటీసీలు ఇప్పటికే ఏకగ్రీవం
మొత్తం 48,256 ఓట్లకు గాను 35,196 ఓట్లు పోల్.. భారీగా తరలివచ్చిన మహిళా ఓటర్లు
ఎస్జీఎస్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు తరలింపు.. శనివారం (7వ తేదీ) కౌంటింగ్!

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి మండల పరిధిలో స్థానిక సంస్థల (ఎంపీటీసీ, జెడ్పీటీసీ) ఎన్నికల పోలింగ్ గురువారం అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా విజయవంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో ఇవ్వటికే 5 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 11 ఎంపీటీసీ స్థానాలతో పాటు జెడ్పీటీసీ స్థానానికి గురువారం ఉదయం 7:00 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై, సాయంత్రం 5:00 గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు -- భారీగా మహిళల భాగస్వామ్యం:
ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి (ఆర్వో) ఎం. శైలజ తెలిపిన అధికారిక గణాంకాల ప్రకారం.. చంద్రగిరి మండలంలో మొత్తం 72.94 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యంగా పురుషుల కంటే మహిళా ఓటర్లే భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం.

చంద్రగిరి మండల అధికారిక పోలింగ్ వివరాలు:
మండల మొత్తం ఓటర్లు: 48,256
పురుషులు: 23,065
మహిళలు: 25,189
ఇతరులు: 2.
పోలైన మొత్తం ఓట్లు: 35,196
పురుషులు: 16,765
మహిళలు: 18,430
ఇతరులు: 1
మొత్తం పోలింగ్ శాతం: 72.94%
ఎస్జీఎస్ కళాశాలకు బ్యాలెట్ బాక్సుల తరలింపు -- 7న కౌంటింగ్:

సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం, ఎన్నికల అధికారులు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేశారు. పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆ బ్యాలెట్ బాక్సులను తిరువతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ (ఎస్జీఎస్) కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం ౮+౫ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అభ్యర్థుల గెలుపోటములపై ప్రస్తుతం మండలవ్యాప్తంగా జోరుగా లెక్కలు, రాజకీయ విశ్లేషణలు కొనసాగుతున్నాయి.

ఘనంగా జాతీయ న్యాయ సేవా వారోత్సవాలు - గిరిజన కాలనీలో న్యాయ అవగాహన ర్యాలీ, సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి, శ్రీకాళహస్తి టౌన్



జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న న్యాయ అవగాహన వారోత్సవాలు శ్రీకాళహస్తిలో విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం శ్రీకాళహస్తి పట్టణంలోని లంకమిట్ట గిరిజన కాలనీలో న్యాయ అవగాహన ర్యాలీతో పాటు న్యాయ విజ్ఞాన సదస్సును ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికిపాటి రమేష్ తదితరులు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంత ప్రజలకు వివిధ చట్టాలు, ప్రాథమిక న్యాయ హక్కులు, విద్య ఆవశ్యకతపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. నిరుపేదలకు న్యాయస్థానాల ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందే విధానాన్ని వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కోర్టు ద్వారా నియమితులైన పారా లీగల్ వాలంటీర్ల దృష్టికి తీసుకువస్తే, వాటిని న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఈ సందర్భంగా న్యాయవాది గరికిపాటి రమేష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజలకు చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉంటే నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. గ్రామాలు, విద్యాసంస్థల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామని తెలిపారు.కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలతో ఇబ్బందులు పడుతున్న బాధితులు న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని వివరించారు. క్షణికావేశంలో కేసులు నమోదు చేసుకుని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలనుకునే వారు లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గరికిపాటి రమేష్, శ్రీరామ్ స్థానిక గిరిజనులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మూడు తరాల అనుబంధానికి మధుర వేదికగా శ్రీచైతన్య

ఆడపిల్లల గొప్పతనాన్ని చాటుతూ అమ్మమ్మలు, నానమ్మలు, తల్లులతో ఆత్మీయ వేడుక

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ శ్రీచైతన్య పాఠశాల ప్రీ ప్రైమరీ విభాగంలో మూడు తరాల మధ్య ప్రేమానుబంధాలను పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఆడపిల్లల ప్రాముఖ్యతను, కుటుంబంలో వారి విలువను చాటిచెప్పడంతో పాటు అమ్మమ్మలు,నానమ్మలు,తల్లులు,చిన్నారుల మధ్య ఆత్మీయతను మరింత బలోపేతం చేయాలనే గొప్ప సంకల్పంతో ఈ వేడుకను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి అమ్మమ్మలు, నానమ్మలు, తల్లులు తమ చిన్నారులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరై పాఠశాల ప్రాంగణాన్ని సందడిగా మార్చారు. మూడు తరాల వారు ఒకే వేదికపై కలుసుకోవడం,తమ అనుభవాలు,అనుభూతులను పంచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు తమ తల్లులు, అమ్మమ్మలు,నానమ్మలతో కలిసి వివిధ ఆటపాటలు, వినోదభరితమైన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని అందరినీ అలరించారు.ముఖ్యంగా నేటి ఆధునిక జీవనశైలిలో బిజీగా గడుపుతున్న కుటుంబ సభ్యులు ఇలా ఒకచోట చేరి ఆనందంగా సమయం గడపడం అందరిలోనూ ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. తరాల మధ్య అనుబంధాలు,కుటుంబ విలువలు, ఆడపిల్లల పట్ల గౌరవం వంటి సందేశాలను ఈ కార్యక్రమం చక్కగా చాటిచెప్పింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ.. ''ఆడపిల్లలు కుటుంబానికి ప్రెషర్ కాదు.. జీవితానికి ప్లెజర్! ఆడపిల్లను గౌరవించే కుటుంబం ఎదుగుతుంది.. ఆడపిల్లకు అవకాశమిచ్చే సమాజం అభివృద్ధి చెందుతుంది'' అని పేర్కొన్నారు. ఆడపిల్లలను ప్రేమతో, గౌరవంతో పెంచుతూ వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఏజీఎం సురేష్ మాట్లాడుతూ.. ఆడపిల్లలకు సమాన అవకాశాలు, తగిన ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలు అందించినప్పుడే వారు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, కుటుంబ విలువలు, పరస్పర గౌరవం పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. మూడు తరాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి మమకారం, ప్రేమానురాగాలు, కుటుంబ విలువలను చాటిచెప్పిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జులు వానంతి, కల్పనతో పాటు ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ప్రశాంత వాతావరణంలో ముగిసిన జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
రాష్ట్రంలో రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తిరువతి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రేణిగుంట మండల పరిధిలో మొత్తం 62,579 మంది ఓటర్లకు గాను 36,875 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మండలంలో 58.93 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో జెడ్పీటీసీ స్థానానికి బీజేపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొనగా, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి రేణిగుంటలోని 3, 5వ సెగ్మెంట్లతో పాటు గుత్తివారిపల్లి, సూరప్పకశం ప్రాంతాల్లో ఎన్నికలు జరిగాయి.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు
తిరుపతి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో తొట్టంబేడు తహసీల్దార్ భారతి, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
శుక్రవారం 06 నవంబరు 2026

ముందు షెడ్లు.. తర్వాత అనుమతులా...!!

- హిందూపురంలో టపాసుల దుకాణాల ఏర్పాటుపై ప్రశ్నలు
- కలెక్టర్ అనుమతులు రాక ముందే ఎంజీఎం మైదానంలో నిర్మాణాలు
- కానరాని అధికారుల పర్యవేక్షణ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

దీపావళి పండుగ వేళ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా, ప్రభుత్వ అనుమతులు, అగ్నిమాపక శాఖ భద్రతా పరిశీలనలు పూర్తికాక ముందే టపాసుల దుకాణాల ఏర్పాటుకు షెడ్ల నిర్మాణాలు ఎలా చేపడుతున్నారు. ముందుగా అనుమతులు పొందాల్సిన వ్యాపారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. హిందూపురం పట్టణంలోని ఎంజీఎం మైదానంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు జరుగుతున్న సన్నాహాలు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. ప్రతి ఏడాది దీపావళి సందర్భంగా ఇక్కడ తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ నుంచి ఎలాంటి అనుమతులు మంజూరు కాకపోయినా వ్యాపారులు ముందుగానే షెడ్ల నిర్మాణ పనులు చేపడుతుండటం చర్చనీయాంశంగా మారింది.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

పేలుడు పదార్థాల చట్టం--1884, పేలుడు పదార్థాల నిబంధనలు--2008 ప్రకారం బాణసంచా విక్రయాలకు కఠినమైన భద్రతా నిబంధనలు ఉన్నాయి. ముఖ్యంగా 84వ నిబంధన ప్రకారం తాత్కాలిక బాణసంచా దుకాణాలకు జిల్లా మేజిస్ట్రేట్ అనుమతితో ఎల్ఈ--5 లైసెన్సులు మంజూరు చేయాలి. ఈ లైసెన్సు గరిష్ఠంగా 15 రోజుల కాలానికి మాత్రమే చెల్లుబాటవుతుంది. మండే స్వభావం లేని పదార్థాలతోనే తాత్కాలిక షెడ్లు నిర్మించాలి. ఒక దుకాణానికి మరో దుకాణానికి మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. రక్షిత ప్రదేశాల నుంచి కనీసం 50 మీటర్ల దూరం పాటించాలి. షెడ్లు ఎదురెదురుగా ఉండకూడదు. ఒక సముదాయంలో 50కి మించి దుకాణాలు ఏర్పాటు చేయరాదు. షెడ్లలో బహిరంగ మంటలు, నూనె దీపాలు, గ్యాస్ దీపాలు వినియోగించకూడదు. విద్యుత్ వైరింగ్, స్విచ్‌ల ఏర్పాటు కూడా భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసమే ఈ నిబంధనలను రూపొందించారు.

అనుమతులు రాకముందే నిర్మాణాలా...!

సాధారణంగా టపాసుల దుకాణాల ఏర్పాటుకు ముందుగా రెవెన్యూ అధికారులు వ్యాపారులతో సమావేశం నిర్వహించి అర్హులైన వారి వివరాలను సేకరించాలి. అనంతరం దుకాణాలకు సంఖ్యలు కేటాయించి స్థలాలను కేటాయించాలి. అగ్నిమాపక శాఖ అధికారులు సూచించిన భద్రతా ప్రమాణాల మేరకే తాత్కాలిక షెడ్ల నిర్మాణాలు చేపట్టాలి. విద్యుత్ సౌకర్యాలు, అగ్నిమాపక పరికరాలు, దుకాణాల మధ్య దూరం తదితర అంశాలను పరిశీలించిన తర్వాతే విక్రయాలకు అనుమతించాలి. అయితే హిందూపురం ఎంజీఎం మైదానంలో ఈ ప్రక్రియ పూర్తికాకముందే షెడ్ల నిర్మాణాలు జరుగుతుండటం గమనార్హం. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు వ్యాపారులకు ఎవరు అనుమతిచ్చారు? అధికారుల నుంచి ముందస్తు ఆదేశాలు ఏమైనా అందాయా? లేక అధికారుల పర్యవేక్షణ లేకుండానే పనులు కానిసాగుతున్నాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జీఎస్టీ చెల్లింపులే అనుమతులా..

ఈ విషయంపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ నుంచి టపాసుల దుకాణాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు రాలేదని తెలిపారు. జీఎస్టీ పూర్తిగా చెల్లించిన వ్యాపారుల వివరాలను అనుమతుల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు పంపించామని, అనుమతులు వచ్చిన వెంటనే వాటి ప్రతులను సంబంధిత వ్యాపారులకు అందజేస్తామని పేర్కొన్నారు. అధికారుల వివరణ ప్రకారమే అనుమతుల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని స్పష్టమవుతోంది. మరి కలెక్టర్ అనుమతులు రాకముందే షెడ్ల నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి, జీఎస్టీ చెల్లింపు అనేది పన్నులకు సంబంధించిన అంశం మాత్రమే. అది బాణసంచా విక్రయాలకు అవసరమైన ప్రత్యేక లైసెన్సుకు ప్రత్యామ్నాయం కాదు. ఈ విషయం తెలిసినా అధికారులు ముందస్తు చర్యలు ఎందుకు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టేస్తున్నారా...

పట్టణ ప్రణాళిక అధికారులను ఇదే విషయంపై వివరణ కోరగా.. రెవెన్యూ అధికారులు అనుమతులు మంజూరు చేసిన వ్యాపారులకు మాత్రమే స్థలాలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అంటే రెవెన్యూ శాఖ అనుమతులు ఇచ్చిన తర్వాతే స్థల కేటాయింపులు జరగాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం షెడ్ల నిర్మాణాలు ముందుకు సాగుతున్నాయి. ఒకవైపు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇంకా రాలేదని చెబుతుండగా, మరోవైపు నిర్మాణాలు కొనసాగుతుండటం సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపాన్ని స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న పనులను వర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం కరువవుతోంది.

ప్రమాదం జరిగాక స్పందిస్తారా,

బాణసంచా దుకాణాల విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ అగ్నిప్రమాదానికి దారితీసే ప్రమాదం ఉంది. అందుకే ముందస్తు అనుమతులు, దుకాణాల మధ్య దూరం, అగ్నిమాపక పరికరాలు, విద్యుత్ భద్రత, ప్రజల రాకపోకలకు ఆటంకం లేకుండా స్థల కేటాయింపు వంటి అంశాలను అధికారులు కచ్చితంగా పరిశీలించాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లయితే వాటిని నిలిపివేసి, సంబంధిత వ్యాపారులకు నిబంధనలపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి రెవెన్యూ, అగ్నిమాపక, పట్టణ ప్రణాళిక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది. దీపావళి పండుగ ప్రజలకు ఆనందాన్ని పంచాలి తప్ప అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలకు వేదిక కాకూడదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని నిబంధనల అమలుపై దృష్టి సారిస్తారా...లేక ప్రమాదం జరిగిన తర్వాతే స్పందిస్తారా... అన్నది వేచి చూడాలి.

నార్పలలో ప్రశాంతంగా ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

74 శాతం పోలింగ్ నమోదు.. -గెలుపుపై అభ్యర్థుల ఆశలు.. శనివారం ఫలితాలపై ఉత్కంఠ!

ప్రజా భూమి నార్పల

నార్పల మండలంలో గురువారం నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండల కేంద్రంతో పాటు పరిధిలోని అన్ని గ్రామాల్లో ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 47,116 మంది ఓటర్లకు గాను 34,888 మంది ఓటు వేయడంతో మండలవ్యాప్తంగా 74 శాతం పోలింగ్ నమోదైంది. ఈ మేరకు సహాయ ఎన్నికల అధికారి విడుదల చేసిన తుది నివేదికలో వెల్లడించారు. పోలైన ఓట్లలో పురుషులు 17,611 మంది, మహిళలు 17,274 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనడం విశేషం.

గ్రామాలవారీగా పోలింగ్ శాతం వివరాలు..

అధికారిక నివేదిక ప్రకారం బి.పప్పూరులో 81 శాతం, బండ్లపల్లిలో 79 శాతం, బొందలవాడలో 68 శాతం, చామలూరులో 87 శాతం, దుగ్గుమర్రిలో 78 శాతం, గడ్డంనాగేపల్లిలో 83 శాతం, గంగనపల్లిలో 82 శాతం, గూగూడులో 79 శాతం, హెచ్.శోధనపల్లిలో 87 శాతం, కేసేపల్లిలో 79 శాతం, నార్పల-1లో 63 శాతం, నార్పల-2లో 59 శాతం, నార్పల-3లో 66 శాతం, నార్పల-4లో 65 శాతం, నార్పల-5లో 68 శాతం, వెంకటాంపల్లిలో 78 శాతం పోలింగ్ నమోదైంది. చామలూరు, హెచ్.శోధనపల్లిలో అత్యధికంగా 87 శాతం పోలింగ్ నమోదు కాగా, నార్పల-2లో అత్యల్పంగా 59 శాతం పోలింగ్ నమోదైంది.

అభ్యర్థుల్లో నెలకొన్న ఉత్కంఠ.. గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

ఎన్నికల పోలింగ్ ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు తమకు అనుకూలంగా ప్రజా తీర్పు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలవారీగా పోలింగ్ సరళిని విశ్లేషించుకుంటూ గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్నారు. ఓటర్లు ఎవరికి మద్దతు తెలిపారో తెలియాలంటే శనివారం వెలువడనున్న ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

పోలీసులు, ఎన్నికల అధికారుల పనితీరుపై అభినందనలు..

ఎన్నికల నిర్వహణకు అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగింపు వరకు అధికారులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దీంతో అధికారుల పనితీరుపై మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు శ్రావణ శ్రీ..

మండల కేంద్రం నార్పలతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు శ్రావణ శ్రీ పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి కల్పించిన వసతులు, ఇతర ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.అదేవిధంగా రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ అభ్యర్థులు బి.శివానందరెడ్డి, ఆకుల అరుణ, రామ్మోహన్ చౌదరి, ఆర్వో భారతి, ఏఆర్వో మమతా దేవి, తహసీల్దార్ అరుణకుమారి తదితరులు వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. మొత్తంగా నార్పల మండలంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో ఎన్నికల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 74 శాతం పోలింగ్‌తో ముగిసిన ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఏమిటన్నది శనివారం వెలువడనున్న ఫలితాలతో తేలనుంది.

పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి....

జడ్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి...

ప్రజాభూమి ప్రతినిధి, భీమవరం:

అర్నబ్ తుపాను తీవ్ర ప్రభావంతో పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, గృహ విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్లు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం భీమవరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తుపాను కారణంగా విద్యుత్ శాఖకు జరిగిన నష్టం, చేపట్టిన పునరుద్ధరణ పనులు, ప్రస్తుత పరిస్థితుల వివరాలను వెల్లడించారు. జిల్లాలో తుపాను ప్రభావానికి గురైన 98 విద్యుత్ ఉపకేంద్రాల్లో పునరుద్ధరణ పనులు 100 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ప్రభావితమైన 67, 33 కేవీ విద్యుత్ లైన్లలో 65 లైన్లను పునరుద్ధరించగా, మిగిలిన రెండు లైన్ల పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. అదేవిధంగా 475 ,11 కేవీ విద్యుత్ లైన్లలో 472 లైన్లను పునరుద్ధరించినట్లు తెలిపారు. మిగిలిన మూడు లైన్లను కూడా గురువారం సాయంత్రానికి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించడం, అధిక, అల్ప పీడన విద్యుత్ లైన్లపై పడిన చెట్లను తొలగించడం, కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం వంటి పనులను భారీ స్థాయిలో చేపట్టామన్నారు. రాష్ట్రంలోని వివిధ విద్యుత్ పంపిణీ సంస్థల సిబ్బందితో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యుత్ సిబ్బంది కూడా పునరుద్ధరణ పనుల్లో పాల్గొని సేవలందించారని తెలిపారు.జిల్లాలో తుపాను ప్రభావానికి గురైన ఆరు విభాగాలు, 20 మండలాల్లోని 409 గ్రామాల్లో గృహ విద్యుత్ సరఫరాను 100 శాతం పునరుద్ధరించినట్లు వెల్లడించారు. జిల్లాలో 17,584 ప్రభావిత ఆక్వా విద్యుత్ సర్వీసులకు గాను 14,595 సర్వీసులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని, మిగిలిన 2,989 ఆక్వా సర్వీసులతో పాటు వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు కూడా రానున్న ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.జిల్లావ్యాప్తంగా 226 బృందాలకు చెందిన 3,254 మంది అధికారులు, విద్యుత్ సిబ్బంది నిరంతరం పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. తుపాను కారణంగా విద్యుత్ రంగానికి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.50.49 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్తలు, సమన్వయ చర్యల కారణంగా ఎలాంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి గృహ విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించారని సీఎండీ తెలిపారు. ప్రజలకు విద్యుత్ అంతరాయాల వల్ల కలిగిన ఇబ్బందులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేశారని అభినందించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు:



- పశ్చిమగోదావరి జిల్లా కాల్ సెంటర్: 9490610152
- భీమవరం డివిజన్: 9493177646
- నరసాపురం డివిజన్: 7382050943
- తాడేపల్లిగూడెం డివిజన్: 9493177806

జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయాలు లేదా ఇతర విద్యుత్ సమస్యలు తలెత్తితే పై నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని సీఎండీ తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ,అర్నబ్ తుపాను కారణంగా జిల్లాలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో అంకితభావంతో పనిచేయడం వల్లే ఇంత తక్కువ సమయంలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయడం సాధ్యమైందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తుపాను సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది చూపిన సమన్వయం, సమర్థవంతమైన పనితీరు అభినందనీయమని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పనిచేశారని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, విద్యుత్ శాఖ డైరెక్టర్ సూర్య ప్రకాష్, ఎస్ఈ పి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

లింగాల మండలంలో రీపోలింగ్ నిర్వహించాలి



ప్రజాభూమి, పులివెందుల :

లింగాల మండలంలో రీపోలింగ్ నిర్వహించాలని జడ్పీటీసీ అభ్యర్థి పెద్దమల్లు శ్రీదేవి భర్త శ్రీనివాసులరెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కోరారు. మండలంలోని ఇప్పట్ల, పార్నపల్లి, దొండ్లవాగు,కోమన్నుతల, బోనాల కామసముద్రం తదితర గ్రామాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు స్థానిక ఓటర్ల ఓట్లు వేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆర్వోను కలిసి రీపోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు పోలీసుల పర్యవేక్షణ

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ టి. నరసింహులు



ప్రజాభూమి, వేంపల్లె

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పోలీసులు పర్యవేక్షణ చేపట్టారు. ఇందులో భాగంగా వేంపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల తదితర పోలింగ్ కేంద్రాలను సీఐ టి. నరసింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా గొడవలు సృష్టించినా, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు సీఐ నరసింహులు తెలిపారు.

శింగనమల మండలంలో ప్రశాంతంగా ముగిసిన జడ్పీటీసి ఎంపిటీసి ఎన్నికలు

మండలంలో 76 శాతం పోలింగ్



ప్రజా భూమి శింగనమల

మండల కేంద్రమైన శింగనమల తోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జరిగిన జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండల వ్యాప్తంగా 76 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు పోలింగ్ శాతం బాగా పెరగడంతో బరిలో నిలిచిన అభ్యర్థులందరూ విజయం పై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు ప్రజల తీర్పు ఎలా ఉందో తెలియాలంటే శనివారం వరకు వేచి చూడాల్సిందేఫలితాలు ఎలా ఉన్నా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో మండల ప్రజలు, అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

అధికారులు పోలీసుల పనితీరుపై ప్రశంసలు....

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి అధికారులు పోలీసులు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టి ఎన్నికలు ప్రశాంతంగా విజయవంతంగా జరిగే విధంగా చేయడంతో ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు పోలీసుల పనితీరును మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు

పోలింగ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు శ్రావణ శ్రీ

మండల కేంద్రమైన శింగనమల తో పాటు పలు గ్రామాల్లో గురువారం జరిగిన ఎంపీటీసీ జడ్పిటిసి పోలింగ్ సర్వేని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పరిశీలించి పోలింగ్ సిబ్బందికి అన్ని ఏర్పాట్లు ఉన్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు అదేవిధంగా రాష్ట్ర ఎన్నికల పరిశీలకు సుబ్బారెడ్డి సింగనమల మండలంలో పలు బూతులు పర్యటించాడు

జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న రవికుమార్ రెడ్డి

- ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచన

ప్రజాభూమి, వేంపల్లె

గురువారం వేంపల్లి మండలంలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యంలో తమకు లభించిన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది.



ప్రజాభూమి

జనరల్ 10

శుక్రవారం 06 నవంబరు 2026

ఎస్ఈసీ పక్షపాత వైఖరితోనే ప్రజాస్వామ్యానికి ఓటమి

- సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతర్
- 31,500 పోలింగ్ బూత్‌లకు గాను కేవలం 16 వేల బూత్‌లలోనే సీసీ కెమెరాలు
- కుప్పం నుంచి పులివెందుల వరకు రిగ్గింగ్‌లు, దాడులు, అక్రమ నిర్బంధాలు
- కౌంటింగ్ అక్రమాలపై సీసీ కెమెరాల ఫుటేజ్ భద్రపరచాలని ఎస్ఈసీకి విజ్ఞప్తి
- అక్రమాలకు పాల్పడిన అధికారులు, పోలీసులపై న్యాయపోరాటం..
- ఎస్ఈసీని సైతం ఈ అక్రమాలకు బాధ్యత వహించాల్సిందే : లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఎన్ఈసీ పక్షపాత వైఖరి వల్లే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఓడిపోతోందని, కట్టలు కట్టలుగా ఫిర్యాదులు, ఎన్నికల్లో అక్రమాలకు ఆధారాలు సమర్పించినా ఎన్ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆసహనం వ్యక్తం చేశారు. పరిషత్ ఎన్నికల్లో అధికార కూటమి పార్టీల అక్రమాలను ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కి వివరించిన అనంతరం అక్కడే పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో టీడీపీకి చెందిన చోటామోటా నాయకులు యథేచ్ఛగా తిరుగుతూ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని, అందుకే కౌంటింగ్ కేంద్రాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను భద్రపరచాలని మరోసారి ఎస్ఈసీని కోరినట్టు చెప్పారు. ఆ ఫుటేజ్ ఆధారంగా అక్రమాలకు పాల్పడిన టీడీపీ నాయకులను, అధికారులను న్యాయస్థానాల్లో బాధ్యులుగా నిలబెడతామని లేళ్ల అప్పిరెడ్డి హెచ్చరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, పార్టీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డిలతోపాటు పార్టీ అనుబంధ విభాగాలకు చెందిన పలువురు నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే....

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గత మున్సిపల్ ఎన్నికల తరహాలోనే కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా నిర్బంధించడం, హౌస్ అరెస్టులు చేయడం, పార్టీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించడం వంటి చర్యలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులను ఉపయోగించుకుని అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌లో సైతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచిన చోట రీకౌంటింగ్ పేరుతో ఫలితాలను తారుమారు చేసి టీడీపీ అభ్యర్థులు గెలిచినట్లు ప్రకటించిన దారుణ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి.ఎస్ఈసీని కలిసి ఫిర్యాదులు చేసినా, ఆధారాలు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలైనా ప్రశాంతంగా నిర్వహించాలని కోరినా పట్టించుకోలేదు. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ఎన్నికల నిర్వహణలో వాటిని తుంగలో తొక్కారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీడియో షూటింగ్, వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని, అభ్యర్థులకు రక్షణ కల్పించాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా చూడాలని సుప్రీంకోర్టు ఆదేశించినా అమలు చేయలేదు. రాష్ట్రంలో మొత్తం 31,500 పోలింగ్ బూత్‌లు ఉంటే కేవలం 16 వేల బూత్‌లలో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మిగిలిన 15 వేల పోలింగ్ కేంద్రాల్లో కనీసం వీడియో షూటింగ్ కూడా సక్రమంగా జరగలేదు. కుప్పంలో సీసీ కెమెరాలు లేకుండా ఏజెంట్లను బయటకు పంపించి రిగ్గింగ్‌కు పాల్పడిన పరిస్థితులు కనిపించాయి. పులివెందులలో పెట్రోల్ బాంబులతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, ఏజెంట్లను పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం, కీలక నేతలను హౌస్ అరెస్టులు చేయడం కొనసాగింది. శిల్పా రవి, చక్రపాణిరెడ్డి, కోడూరు శ్రీనివాసులు, మేరుగ నాగార్జున, శైలజానాథ్ వంటి వైఎస్సార్‌సీపీ నాయకులను నిర్బంధించారు. శ్రీకాకుళంలో ఎమ్మెల్యే శంకర్ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు దిగుతుంటే, తెక్కలిలో అచ్చెన్నాయుడు ఏజెంట్లకు ఫోన్లు చేసి పిలిపిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు వల్లాడు జిల్లాలోనూ ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారు. పల్నాడు జిల్లాలో ఉదయం 10.30 గంటలకే పోలింగ్ అయిపోయిందంటూ ఓటర్లను వెనక్కి పంపిన ఘటనలు జరిగాయి. పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఉరవకొండలోని కూడేరు మండలంలో సీఐ దగ్గరుండి దాడులు చేయించాడు. పోలీసు, రెవెన్యూ అధికారుల అండతో జరుగుతున్న ఈ అక్రమాలన్నింటికీ బాధ్యులు ఎవరో తేల్చాల్సిందే. నిన్నటి కౌంటింగ్‌లోనూ వైఎస్సార్‌సీపీ గెలిచిన చైర్‌పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ అభ్యర్థుల విజయాలను ప్రకటించకుండా టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో ఫలితాలను తారుమారు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో టీడీపీకి చెందిన చోటామోటా నాయకులు యథేచ్ఛగా తిరుగుతూ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారు. అందుకే కౌంటింగ్ కేంద్రాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను భద్రపరచాలని మరోసారి ఎస్ఈసీని కోరాం. ఆ ఫుటేజ్ ఆధారంగా అక్రమాలకు పాల్పడిన టీడీపీ నాయకులను, అధికారులను న్యాయస్థానాల్లో బాధ్యులుగా నిలబెడతాం. ఇప్పటివరకు కట్టలు కట్టలుగా ఫిర్యాదులు, ఆధారాలు సమర్పించినా ఎస్ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం. ఎన్ఈసీ పక్షపాత వైఖరి వల్లే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఓడిపోతోంది. ఎన్నికల్లో ప్రజలు ఓడిపోతున్నారు, ప్రజాస్వామ్యం ఓడిపోతోంది, అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్న కూటమి నేతలకు మాత్రం అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ఇకపై అక్రమ నిర్బంధాలకు, రిగ్గింగ్‌లకు, కౌంటింగ్ అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్క అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఎస్ఈసీని కూడా న్యాయపోరాటంలో బాధ్యురాలిగా నిలబెడతాం. తప్పు చేసిన పోలీసు, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులందరిపై చట్టపరంగా, న్యాయపరంగా పోరాటం చేస్తాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి స్పష్టం చేశారు.

ప్రజా తీర్పును గౌరవించడంలో జగన్ డీఎన్ఏలోనే లేదు

ఓటు వేయని జగన్‌కు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదు

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగాయి -ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:

జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు చూస్తే ఆత్మస్తుతి, పరనింద మాత్రమే కనిపిస్తున్నాయి. మాటలు మార్చడంలో జగన్ ను మించినవారు ఎవరూ లేరని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా ఈవీఎం వల్లే గెలిచారని ప్రచారం చేశారు. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే వైఖరి కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అందరికీ ఒకటే. పేదవాడికైనా, ధనికుడికైనా, ప్రధానమంత్రికైనా, రాష్ట్రపతికైనా ఒకే ఓటు. కానీ బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో వచ్చి నేను ఓటు వేయడానికి వెళ్తున్నాను అని చెప్పి, పోలింగ్ బూతు దగ్గరకు వెళ్లి ఓటు వేయకుండా వెనక్కి తిరిగి వచ్చిన ఏకైక రాజకీయ నాయకుడు జగన్మోహన్ రెడ్డి. ఇది ప్రజాస్వామ్యం పట్ల, ప్రజల ఓటు పట్ల ఆయనకు ఉన్న నమ్మకం ఏమిటో స్పష్టం చేస్తోంది. ఓటు వేయని రాజకీయ నాయకుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు. కూటమి ప్రభుత్వాన్ని బదనామ్ చేయడానికి వైసీపీ నానా ఫీట్లు చేస్తోంది. 2024లో ప్రజలు ఇచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌ను మరోసారి మున్సిపల్, కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇచ్చారు. ఓటమిని జీర్ణించుకోలేక నిరాశతో ఆరోపణలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు జరిగితే అద్భుతం అన్నారు. ఇప్పుడు జరిగితే దౌర్జన్యం అంటున్నారు. తమ హయాంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్‌ను నిర్వీర్యం చేసి, ఎలక్షన్ కమిషనర్ ప్రాణహాని ఉందని కేంద్రానికి లేఖ రాసిన విషయం మర్చిపోకూడదు. ఇప్పుడు పారదర్శకంగా ఎన్నికలు జరుగుతుంటే విమర్శలు చేస్తున్నారు. పులివెందుల, పలమనేరు వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా ధనబలం, కండబలంతో గుత్తాధిపత్యం సాగించిన వారు, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడానికి వస్తే దౌర్జన్యాలకు పాల్పడిన విషయం అందరూ చూశారు. ఎంపీటీసీ స్థానాల్లో 17,726 చోట్ల వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. జెడ్పీటీసీల్లో 1,445 స్థానాల్లో వేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో 367 స్థానాల్లో వేశారు. గ్రామ పంచాయతీల్లో వేలాది స్థానాల్లో వేశారు. పోలీసు రక్షణతో, పోలీసు వాహనాల్లో అభ్యర్థులను తీసుకెళ్లి నామినేషన్లు వేయించారు. సమయం పెంచి అవకాశం ఇచ్చారు. అలా ఉండి కూడా ప్రభుత్వం, పోలీసులు, ఎలక్షన్ కమిషన్ కుమ్మక్కై రిగ్గింగ్ చేశారు అంటున్నారు. అయితే మీ పార్టీకి సంబంధించిన నలుగురు అభ్యర్థులు (ఒకరు మేయర్ సహా) ఎలా గెలిచారు? మీరు చెప్పినట్టు రిగ్గింగ్ ఉంటే మీ అభ్యర్థులు కూడా గెలవకూడదు కదా? ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడానికి డీలిమిటేషన్, ఇతర అంశాలపై 61 కేసులు వేశారు. బీసీ రిజర్వేషన్ విషయంలో హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు కేసులు వేశారు. కానీ చట్టపరమైన అవకాశం లేకపోయినా సూత్రప్రాయంగా బీసీలకు సీట్లు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. సుప్రీంకోర్టు కూడా ప్రజాక్షేత్రంలో తేల్చుకోండి అని చెప్పింది. ప్రజాక్షేత్రంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగాయి. ప్రజలు మీ అసత్య ప్రచారాలను నమ్మలేదు. వైసీపీ నమ్ముకున్నది విధ్వంసాన్ని. మేము నమ్ముకున్నది ప్రజలను, ప్రజాతీర్పును, అభివృద్ధిని, సంక్షేమాన్ని. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన పనులు ప్రజలు చూశారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీరు నాలుగు స్థానాలకు పరిమితమయ్యారు. ప్రజల్లోకి వచ్చి పోరాడండి. ప్రజాతీర్పును గౌరవించండి. అనవసరమైన, అర్థరహితమైన ఆరోపణలు మానుకోండి. అసెంబ్లీకి రాకుండా, అప్పుడప్పుడు వచ్చి బురద చల్లి వెళ్లిపోయే ధోరణి మానేయండి. గెలుపోటములు ప్రజలు నిర్ణయిస్తారు. ప్రజాతీర్పును అపహాస్యం చేయడం తీవ్రంగా ఖండనీయం. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం పని చేస్తూనే ఉంటుందన్నారు.

రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి.

గొడ్డలి పార్టీ అబద్ధాలు, అరాచకాలతో ఓటర్లను మభ్యపెట్టి భయపెట్టి గెలవాలని చూస్తోంది

కడప, పులివెందులలో గొడవలకు కారణం జగన్ రెడ్డి -టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:

జెడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ పార్టీ అబద్ధాలు, అరాచకాలు, భయభ్రాంతుల ద్వారా ఓటర్లను మభ్యపెట్టి గెలవాలని ప్రయత్నిస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చూసిన తర్వాత జగన్మోహన్ రెడ్డి గొడవలు సృష్టించి గెలవాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు. దీనికి నిదర్శనంగా పులివెందులలోని ఎర్రిపల్లిలో బాంబు దాడుల ద్వారా ఓటర్లను భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటు ఓటింగ్ సుమారు 22 శాతం ఉండగా, రాయలసీమ ప్రాంతాల్లో చిత్తూరు 33 శాతం, అనంతపురం 30 శాతం, కర్నూలు 30 శాతం నమోదైంది. కానీ కడపలో తక్కువ నమోదు కావడానికి వెనుక వైసీపీ, జగన్మోహన్ రెడ్డి కుట్రలే కారణమని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యబద్ధంగా బయటకు వచ్చి ఓటు వేస్తుంటే వారిని బాంబుల ద్వారా భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కడపలో పార్లమెంట్ సభ్యుడు అవినాష్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా బూతుల్లోకి ప్రవేశించడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. అర్బన్ లోకల్ బాడీస్‌లో కూటమికి వచ్చిన భారీ ఫలితాలు (సుమారు 95 శాతం స్ట్రైక్ రేట్) జెడ్పిటిసి-ఎంపిటిసి ఎన్నికల్లో కూడా పునరావృతమవు తాయనే భయంతో వైసీపీ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తోంది. కుప్పంలో బయట ప్రాంతాల నుంచి రౌడీలను తీసుకొచ్చి ఓట్లు వేయించే ప్రయత్నాలు, తిరుపతిలో గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లాగే ఆధార్ కార్డులు ఇచ్చి సామాన్య ఓటర్లను తీసుకొచ్చి ఓటు వేయించే ప్రయత్నాలు, రామచంద్రపురంలో ఓటర్లకు డబ్బులు పంచి బలవంతం చేసిన సంఘటనలు, పొంగనూరులో తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై దాడి, జమ్మలమడుగులో రామ సుబ్బారెడ్డి కుమారుని



దౌర్జన్యం, రైల్వే కోడూరులో పెట్రోల్ బాంబు, అనంతపురం స్కూల్ వద్ద పెట్రోల్ బాంబు వంటి సంఘటనలు వైసీపీ విధానాన్ని స్పష్టం చేస్తున్నాయి. పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా బయటకు వస్తుంటే పెట్రోల్ బాంబులు వేయడం, బూత్ క్యాప్చరింగ్, బయటి ప్రాంతాల నుంచి జనాన్ని మొబిలైజ్ చేయడం వంటి దుర్మార్గపు ఆలోచనలతో వైసీపీ ముందుకు వెళ్తోంది. రాష్ట్రవ్యాప్తంగా స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతుంటే పులివెందుల, పొంగనూరు వంటి ప్రాంతాల్లోనే గొడవలు ఎందుకు జరుగుతున్నాయో ప్రజలు ఆలోచించాలి. ఇది రాజకీయమా? రౌడీజమా? కూటమి ప్రభుత్వం నిబద్ధతతో, ప్రజలకు అనుకూలంగా పాలన సాగిస్తోంది. అర్బన్ లోకల్ బాడీస్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పే జెడ్పిటిసి-ఎంపిటిసి ఎన్నికల్లో కూడా వస్తుందని ప్రజలు నమ్ముతున్నారు. అందుకే వైసీపీ అరాచకాలు, అబద్ధాలు, భయభ్రాంతుల ద్వారా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోంది. ప్రజలు అరాచకాన్ని సహించరు. రాయలసీమ ప్రజలు సహించరు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి. జగన్మోహన్ రెడ్డి దుష్ప్రచారాలు మానుకోవాలి. ప్రజల తీర్పును గౌరవించాలి. విద్వేషం, హింస ద్వారా ఓట్లు గెలవాలనుకుంటే ప్రజలు సహించరు. కూటమి ప్రభుత్వం మీద నమ్మకంతో ప్రజలు స్వేచ్ఛగా వచ్చి ఓటు వేస్తున్నారు. అదే నమ్మకాన్ని కొనసాగిస్తూ ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టుకుంటామని ఆయన అన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలి

నిమ్మాడ ప్రభుత్వ పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,నిమ్మాడ:

ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికీ ఓటు హక్కు సమానమనే సందేశాన్ని చాటుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఆయన సతీమణి కింజరాపు విజయమాధవి, కుమారుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడు ఓటు వేశారు.ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు తన అధికారిక హోదాను పక్కనపెట్టి సామాన్య పౌరుడిలా ఇతర ఓటర్లతో కలిసి క్యూలైన్‌లో నిలబడ్డారు. తన వంతు వచ్చే వరకు వేచి ఉండి ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యంలో అందరూ సమానమేనని చాటిచెప్పారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే పునాది అని, ప్రజల భవిష్యత్తును నిర్ణయించే అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు ఓటు అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటు కీలకమని, ఒక్క ఓటు కూడా సమాజ భవిష్యత్తును మార్చగలదని అన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాదని, సమాజం పట్ల ప్రతి పౌరుడికీ ఉన్న బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ బాధ్యతాయుతమైన పౌర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.



రాష్ట్రంలో పతనావస్థలో పోలీస్ వ్యవస్థ -వెన్నుపోటు పార్టీకి తోలుబొమ్మల్లా పోలీసులు

పరిషత్ ఎన్నికల్లో పరాకాష్టకు అరాచకాలు-వెన్నుపోటు పార్టీ మరింత బరితెగింపు-:టీజేఆర్ సుధాకర్‌బాబు

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:

స్థానిక సంస్థల ఎన్నికలను వెన్నుపోటు పార్టీ పూర్తిగా అపహాస్యం చేస్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఫైర్ అయ్యారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆయన ఆక్షేపించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా అధికార పార్టీకి తొత్తుగా మారిందని ధ్వజమెత్తారు. అందుకే గతంలో ఎప్పుడూ హింసాత్మక ఘటనలు జరగని బూత్‌లలో సైతం ఇప్పుడు దౌర్జన్యాలు జరుగుతున్నాయని చెప్పారు. కొన్ని చోట్ల ఏకంగా పోలీసులే ఓటర్లను అడ్డుకోవడం అత్యంత హేయమని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన టీజేఆర్ సుధాకర్‌బాబు తేల్చి చెప్పారు.

ప్రెస్‌మీట్‌లో టీజేఆర్ సుధాకర్‌బాబు ఇంకా ఏం మాట్లాడారంటే..:

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పరాకాష్టకు అరాచకాలు:

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వెన్నుపోటు పార్టీ అరాచకాలు పరాకాష్టకు చేరాయి. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకోవడం, నోటీసులు ఇవ్వడం, హౌస్ అరెస్టులు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మరోవైపు టీడీపీ నాయకులు, గుండాలకు రిగ్గింగ్‌లు, పోలింగ్ బూత్‌ల ఆక్రమణలకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి బలమైన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ఘర్షణలు సృష్టించే వ్యూహాలు అమలు చేస్తున్నారు. గతంలో ఎలాంటి గొడవలు జరగని పోలింగ్ కేంద్రాల్లోనూ నేడు దాడులు, ఘర్షణలు జరుగుతున్నాయి. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే ఓటమి తప్పదన్న భయంతోనే చంద్రబాబు అంతులేని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

దిగజారిన పోలీస్ వ్యవస్థ.

తోలుబొమ్మల్లా పోలీసులు:

ఇతర ప్రాంతాల నుంచి గుండాలను తీసుకొచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థ చంద్రబాబుకు తొత్తుగా మారి టీడీపీ గుండాలకు అండగా నిలుస్తోంది. వైయస్సార్ కడప జిల్లాలో ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డిని డీఎస్పీ మురళీనాయక్ అడ్డుకోవడం, పాలపర్తిలో ఏజెంట్ పత్రాలను చింపివేయడం, పులివెందులలో బీటెక్ రవి పోలింగ్ బూత్‌లలో తిష్టవేసి రిగ్గింగ్‌కు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణం. లింగాల మండలంలో సాక్షి విలేకరి పుల్లారెడ్డిపై టీడీపీ గుండాలు దాడి చేసి ఫోన్ ధ్వంసం చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదు.

మున్సిపల్ ఎన్నికల మాదిరిగానే పరిషత్ ఎన్నికల్లో కూడా యథేచ్ఛగా రిగ్గింగ్ జరుగుతోంది. తిరుపతి జిల్లా పెనగలూరు మండలం నల్లబెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు లాగేశారు. ఇంకా పులివెందుల, శ్రీకాకుళం, అనంతపురం, నంద్యాల, సత్యసాయి, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, కందుకూరు, సింగనమల, చంద్రగిరి, పుంగనూరు ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల ఆక్రమణ చేసి యథేచ్ఛగా రిగ్గింగ్ చేస్తున్నారని, అయినా ఎన్నికల అధికారులు, పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని టీజేఆర్ సుధాకర్‌బాబు ఆక్షేపించారు.

దక్షిణ భారత పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో బాబురావు కు స్వర్ణ పతకం

- 457.5 కేజీల బరువు ఎత్తి ప్రతిభ చాటిన అకడమిక్ డీన్

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీనివాస హైస్కూల్ అకడమిక్ డీన్ బాబు రావు దక్షిణ భారత స్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి పాఠశాలకు, ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. కేరళ రాష్ట్రం కన్నూర్‌లో నవంబర్ 1న నిర్వహించిన పోటీల్లో అండర్--59 కేజీల ఓపెన్ విభాగంలో పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో స్క్వాట్‌లో 182.5 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 82.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 192.5 కేజీలు ఎత్తి మొత్తం 457.5 కేజీలతో అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. కేశవులు మాట్లాడుతూ ఉపాధ్యాయ బాధ్యతలు నిర్వహిస్తూనే క్రీడల్లోనూ ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. డైరెక్టర్ పి. చంద్రబాబు మాట్లాడుతూ బాబు రావు విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ తనకు మార్గదర్శకత్వం అందించిన కడప జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ బాలగోవింద్ తివారీకి, ప్రోత్సాహం అందించిన పాఠశాల కరస్పాండెంట్ పి. కేశవులు, డైరెక్టర్ పి. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.



ప్రజాభూమి
పోలవరం 11
శుక్రవారం 6 నవంబరు 2026

పోలవరం జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్

- 368 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు
- మొత్తం పోలింగ్ ప్రక్రియను తొలిసారిగా 368 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా రికార్డు చేశాం
- ఈ నెల 7న రంపచోడవరం, చింతూరులో ఓట్ల లెక్కింపు
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె దినేష్ కుమార్





ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం ఐటీడీఏ సమావేశ మందిరంలోని వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ సరళి, భద్రతా ఏర్పాట్లు, కౌంటింగ్ ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు.

63 శాతం పోలింగ్ నమోదు

సాయంత్రం 5 గంటల వరకు ప్రాథమికంగా 63 శాతం పోలింగ్ నమోదైందని, సుమారు 1.40 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. సాయంత్రం 5 గంటల సమయానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లందరికీ క్రమ పద్ధతిలో టోకెన్లు, వరుస సంఖ్యలు కేటాయించి, వారందరూ ఓటు వేసే వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగించామని వివరించారు. కొన్ని కేంద్రాల్లో 5 గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగిందని, తుది పోలింగ్ గణాంకాలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

368 కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్

జిల్లాలోని మొత్తం 368 పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వీటిలో 44 ఎల్‌డబ్ల్యూఈ (వామపక్ష తీవ్రవాద ప్రభావిత) పోలింగ్ కేంద్రాలు ఉన్నప్పటికీ, పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు, ఎన్నికల సిబ్బంది, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు.

తొలిసారిగా అన్ని కేంద్రాల్లో పూర్తి స్థాయి వీడియోగ్రఫీ

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, భవిష్యత్తులో అవసరమైన ఆధారాల కోసం జిల్లాలోని మొత్తం 368 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను పూర్తిస్థాయిలో వీడియోగ్రఫీ ద్వారా రికార్డు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సాధారణంగా కొన్ని ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే ఈ విధానం అమలు చేస్తారని, జిల్లాలో తొలిసారిగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి రికార్డింగ్ చేపట్టడం ప్రత్యేకతగా పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

పోలింగ్ విధులు ముగించుకున్న సిబ్బంది రంపచోడవరం, చింతూరు రిసెప్షన్ కేంద్రాలకు చేరుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచి, లాక్ అండ్ కీ విధానంలో సీల్ చేయనున్నట్లు వివరించారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ ద్వారా రికార్డు చేస్తామని, బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

7వ తేదీన ఓట్ల లెక్కింపు

ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. రంపచోడవరం పరిధిలోని ఎనిమిది మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చింతూరులోని ఏపీఆర్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ విధులకు సిబ్బందిని కేటాయించి, ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని, మొదటి విడత శిక్షణ కూడా పూర్తయిందని తెలిపారు. శుక్రవారం ఉదయం రెండో విడత శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి పలుచోట్ల నగదును స్వాధీనం చేసుకున్నాయని కలెక్టర్ తెలిపారు. జెడ్పీటీసీ అభ్యర్థులకు రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులకు రూ.4 లక్షల చొప్పున ఎన్నికల వ్యయ పరిమితి విధించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీలు, సభలు, ఇతర ప్రచార కార్యక్రమాల ఖర్చులను పరిశీలించి వ్యయాన్ని నిర్ధారిస్తామని స్పష్టం చేశారు.

తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసి ఇందుకూరుపేట వాగు, అన్నవరం వాగు తదితర ప్రాంతాల్లో రహదారులపై వరద నీరు ప్రవహించినప్పటికీ, బొలెరోలు, టాటా ఏస్ వాహనాలు, బస్సుల ద్వారా పోలింగ్ సిబ్బందిని సురక్షితంగా కేంద్రాలకు చేర్చినట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం సిబ్బంది తిరుగు ప్రయాణానికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన ఓటర్లు, ప్రజలు, ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా ఎన్నికల పరిశీలకులు డా బి ఆర్ అంబేద్కర్, సి. సెల్వం లు కూడా పాల్గొన్నారు.

న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా

నవంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు వారోత్సవాలు

- గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన శిబిరాలు
- విద్యార్థులకు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలపై అవగాహన



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాల మేరకు, మండల న్యాయ సేవాధికార సంస్థ, రంపచోడవరం ఆధ్వర్యంలో నవంబర్ 9వ తేదీన నిర్వహించే న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు వారం రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మరియు ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ ఎం. మురళి గంగాధర రావు తెలిపారు.ప్రజల్లో ముఖ్యంగా బలహీన, అణగారిన వర్గాల్లో న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సేవలు అందించాలనే లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేయడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ వారోత్సవాల్లో భాగంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ముఖ్యంగా బలహీన వర్గాలను లక్ష్యంగా చేసుకుని న్యాయ విజ్ఞాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, ఇతర విద్యా సంస్థల్లో న్యాయ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.పారా లీగల్ వాలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), ఇతర భాగస్వాముల సహకారంతో వివిధ వర్గాల ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.కావున ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు, మీడియా ప్రతినిధులు ఈ వారోత్సవాల్లో భాగ స్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని, న్యాయ సేవాధికార సంస్థలు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ కోరారు.

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలి

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి
- అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో లైఫ్‌స్టైల్ మిషన్ కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని అటవీశాఖ అధికారులు పిలుపునిచ్చారు.పోలవరం జిల్లా రంపచోడవరం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శివకుమార్ గంగాల్ ఆదేశాలు, అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ అధికారి సూచనల మేరకు బ్రిక్స్ దేశాల ఒప్పందంలో భాగంగా నిర్వహిస్తున్న 'లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (మిషన్ లైఫ్)' కార్యక్రమంలో ఐదో రోజు కార్యక్రమాన్ని గురువారం అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో నిర్వహించారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ క్యాంపస్ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, ప్లాస్టిక్ గ్లాసులను సేకరించి పరిసరాలను శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి. యిగేంద్రం మాట్లాడుతూ ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, టీ గ్లాసుల వినియోగం వల్ల మైక్రోప్లాస్టిక్‌లు ఆహారం, తాగునీటి ద్వారా మానవ శరీరంలోకి చేరే ప్రమాదం ఉందన్నారు. వీటి ప్రభావంపై మరింత అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీయడమే కాకుండా వన్యప్రాణులు, ఇతర జీవరాశుల మనుగడకు ముప్పుగా మారుతున్నాయని వివరించారు. భూమి, నీరు, గాలి కాలుష్యానికి ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలుస్తున్నాయని తెలిపారు.గ్రామాలు, సముద్ర తీర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిసరాలు కలుషితమై ప్రకృతి అందాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, స్టీల్ వాటర్ బాటిళ్లు, గ్లాసులు, ప్లేట్లు ఉపయోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఎం. అప్పన్నదొర, కె. శిల్ప, ఫారెస్ట్ బీట్ అధికారులు ఎస్. బసవయ్య, చి. రమ్యశ్రీ, ఎం. శ్రీనివాసదొర, ఎం. సత్యనారాయణ, కె. వసంత, బి. శివప్రసాద్, ఎం. సునీతతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పోలవరం ఎస్పీ

ఎన్నికల విధులపై పోలీసు అధికారులకు కీలక సూచనలు





ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, గురువారం అడ్డతీగల, ఎల్లవరం, భీముడుపాకలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతున్న తీరును సమీక్షించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో డీఎస్పీ అష్రఫ్ అలీ, అడ్డతీగల సీఐ గజేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఐడీ కార్డుతో వాటర్‌ను

ప్రలోభ పెట్టిన అధికారపక్ష నాయకుడు..



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని చూచి రేవుల గూడెం అధికార పక్షం టిడిపి ఎంపీటీసీ అభ్యర్థి శ్రీమంతుల త్రివేణి భర్త శ్రీమంతుల సత్యనారాయణ బూత్ ఏజెంట్గా నకిలీ ఐడి కార్డును తయారుచేసి ఎలక్షన్ బూతులు తిరుగుతూ ఓటర్లు ప్రలోభ పెడుతూ ఉండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీమంతుల వెంకటరమణ అతనికి ఐడి కార్డ్ ఎక్కడిది అతను ఎలక్షన్ బూతులు ఏం చేస్తున్నాడు అని అక్కడికి వచ్చిన ఆర్వోను (మండల రిటర్నింగ్) అధికారిని అడగగా వారు వెంటనే వారిని ఐడి అడగడం జరిగింది అందులో మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి అతని సంతకం లేకపోగా అది ఫేక్ ఐడి గా గుర్తించి అతను బయటికి పంపించడం జరిగింది అతను అన్ని బూతుల ఓటర్లను ప్రలోభ పెడుతూ తిరుగుతూ సాక్షాత్తు మండల ఎన్నికల అధికారికి అడ్డంగా దొరికిపోయిన ఆ అధికారి కానీ సంబంధిత పోలీసులు గాని అతనిపై చర్య తీసుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం అని దీనిపై స్పందించి ఆ బూతు ఎన్నికలను రీపోల్ చేయాలని అలాగే ఫేక్ ఐడి తో తిరుగుతూ ప్రజలను ఓటర్లను ప్రభావం పెట్టినందుకు గాను అతనిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీగా డిమాండ్ చేయడం జరుగుతుంది.

రాజవొమ్మంగిలో 63.25 శాతం పోలింగ్ నమోదు

-11 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



ప్రజా భూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో మొత్తం 63.25 శాతం పోలింగ్ నమోదైంది. మండలవ్యాప్తంగా 20,241 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, వీరిలో 9,773 మంది పురుషులు, 10,468 మంది మహిళలు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 695 మంది అధికంగా ఓటు వేయడం గమనార్హం. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

వృద్ధ ఓటర్లకు వీల్‌చైర్‌తో జాయింట్ కలెక్టర్ సాయం!

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన.. వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ చింతూరు ప్రాజెక్టు అధికారి సురపాటి ప్రశాంత్ కుమార్, చింతూరు సబ్ కలెక్టర్ చిట్టిపులి నరేంద్ర పడాల్‌లు పరిశీలించారు. వి.ఆర్.పురం మండలం రేఖపల్లి మినీ గురుకులం పాఠశాలలో ఏర్పాటు చేసిన 8, 9, 10 నంబర్ల పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, ఓటర్లు సౌకర్యవంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధ ఓటర్లకు అండగా నిలుస్తూ జాయింట్ కలెక్టర్ స్వయంగా వీల్‌చైర్‌ను తీసుకువచ్చి వృద్ధులు పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు సహకరించడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సిబ్బందికి సూచించారు.

అడ్డతీగల మండలంలో 59.25 శాతం పోలింగ్ నమోదు

18,247 మంది ఓటర్ల వినియోగం.. మహిళా ఓటర్లే అధికం



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలవ్యాప్తంగా 59.25 శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి రమణ తెలిపారు. మొత్తం 18,246 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు.వీరిలో 8,765 మంది పురుషులు, 9,481 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనడం విశేషం. మండలంలోని మొత్తం 42 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ పూర్తయిందని రిటర్నింగ్ అధికారి రమణ తెలిపారు.

ప్రజాభూమి


జనరల్

శుక్రవారం, నవంబర్ 06, 2026

12

ఎపిఇఆర్సి చైర్ పర్సన్ గా బినోయ్ కుమార్ ప్రమాణ స్వీకారం


ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ (ఎపిఇఆర్సి)చైర్ పర్సన్ గా బినోయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 3వతేదీన జిఓఎంఎస్ సంఖ్య 87 ద్వారా ఎపిఇఆర్సి చైర్ పర్సన్ గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్ (Binoy Kumar)ను నియమించడంతో గురువారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ బినోయ్ కుమార్ తో చైర్ పర్సన్ గా ప్రమాణం చేయించారు.ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఐదేళ్ళ కాలం లేదా 70 సంవత్సరాలు వయస్సు నిండే వరకూ ఏది ముందైతే అది ఆప్రకారం



పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఆఉత్తర్వుల్లో పేర్కొంది. ఎపి ఇఆర్సి చైర్ పర్సన్ గా ప్రమాణం చేసిన బినోయ్ కుమార్ కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.అదే విధంగా ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు సియం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సహా ఇతర అధికారులు బినోయ్ కుమార్ కు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో జెన్కోఎండి నాగలక్ష్మి,సిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి,జెఎండి ట్రాన్స్కో సూర్య సాయి ప్రవీణ్ చంద్,ఎపిఇఆర్సి సభ్యులు పివిఆర్ రెడ్డి,ఎపి నెరెడ్కాప్ విసి అండ్ ఎండి కమలాకర్ బాబు,ఎపిఇఆర్సి కార్యదర్శి పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ





ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః మచిలీపట్నం నార్త్ మండలం కానూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ పోలింగ్ బూత్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మొదటి ఓటు వేశారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఆయన పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.


కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నేడే చివరి తేదీ

ఒక్క రోజు మాత్రమే గడువు



ప్రజాభూమి ప్రతినిధి,గుంటూరు : కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదుకు కావడానికి నవంబరు ఆరవ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గం ఎలక్ట్రో రల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తెలిపారు. ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని, అర్హులైన ఉపాధ్యాయులు వెంటనే ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించడం జరుగుతుందని, గతంలో ఓటర్లుగా నమోదైన ఉపాధ్యాయులు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం కొత్తగా ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందరూ గడువు ముగిసేలోగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.గత ఎన్నికల సమయంలో 13,505 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటి వరకు 10,909 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలిపారు. గత ఎన్నికల గణాంకాలతో పోలిస్తే ఇంకా సుమారు 2,600 మందికి పైగా అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కావాల్సి ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరూ గడువు తేదీ, నవంబరు 6వ తేదీ లోగా ఫారం-19 ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో బాలికకు తిరిగి పాఠశాలలో ప్రవేశం




- కొండాపురం తీసుకొచ్చి పదో తరగతి చదువు కొనసాగించేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా
- బాలిక తండ్రికి కౌన్సెలింగ్ నిర్వహించిన రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ అధికారుల బృందం
- వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న కలెక్టర్, ఎస్పీను అభినందించిన మంత్రి నారా లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి,నెల్లూరు: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక చొరవతో చదువుకు దూరమైన కొండాపురం కేజీబీవీ పాఠశాల పదో తరగతి విద్యార్థినిని తిరిగి పాఠశాలకు చేర్చి, ఆమె చదువును కొనసాగించేలా అధికారులు చర్యలు చేపట్టారు.రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ అధికారులతో కూడిన ప్రత్యేక బృందం బాలికను తిరిగి కొండాపురం తీసుకువచ్చి, కేజీబీవీ పాఠశాలలో మళ్లీ ప్రవేశం కల్పించింది. బాలిక చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేలా ఆమె తండ్రికి విద్యాభ్యాసం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా బాలిక మాట్లాడుతూ.. "నేను ఇటీవల పోస్ట్ చేసిన వీడియోను చూసిన వెంటనే స్పందించి, నన్ను తిరిగి కొండాపురం తీసుకువచ్చి, మళ్లీ పాఠశాలలో ప్రవేశం కల్పించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నేను బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకుంటానని మాట ఇస్తున్నాను" అని తెలిపింది.బాలిక ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆకాంక్షకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ఆమె లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.బాలిక సమస్యపై వెంటనే స్పందించి, ప్రత్యేక బృందాన్ని పంపించి ఆమెను తిరిగి పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల..ను మంత్రి నారా లోకేష్ అభినందించారు.ఇటీవల చదువుకు దూరమై హైదరాబాద్‌లో తన తండ్రి వద్ద ఉంటున్న బాలిక, తిరిగి చదువుకోవాలనే తన ఆకాంక్షను, ఆవేదనను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ట్విట్టర్ ద్వారా తెలియజేసిన విషయం తెలిసిందే.

ఓటు హక్కును వినియోగించుకున్న తులసిరెడ్డి

- ప్రజాస్వామ్యానికి ప్రాణం ఓటు.. నిర్లక్ష్యం చేయకుండా వినియోగించుకోవాలి



ప్రజాభూమి, వేంపల్లె జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా స్థానిక పట్టణంలోని పాత మార్కెట్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధాన భవనంలో ఏర్పాటు చేసిన 32వ పోలింగ్ కేంద్రంలో రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 326వ అధికరణం ద్వారా పౌరులకు ఓటు హక్కు కల్పించబడిందన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రాణం ఓటు అని, ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఇంద్రుని వజ్రాయుధం కంటే, అర్జునుడి గాండీవం కంటే ఓటు శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. ఓటు వేయడం మన హక్కు అని, ఓటు వేయకపోవడం మన తప్పు అని తులసి రెడ్డి అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్

- విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్లలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన
- విజయవంతంగా ముగిసిన ఓటింగ్ ప్రక్రియ: జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ
- పకడ్బందీ భద్రత, వెబ్‌కాస్టింగ్ నిఘా నడుమ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముగింపు
- ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు, సహకరించిన అధికార యంత్రాంగానికి, పోలీస్ యంత్రాంగానికి కలెక్టర్ అభినందనలు

ప్రజాభూమి ప్రతినిదుల బృందం(విజయవాడ/నందిగామ/తిరువూరు) ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. ఉదయం 7.00 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5.00 గంటల వరకు నిరంతరాయంగా, పారదర్శకంగా కొనసాగిందని తెలిపారు. సాయంత్రం 5.00 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ నిబంధనల ప్రకారం టోకెన్లు జారీ చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ ఉదయం నుంచే విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్లలో విస్తృతంగా సుడిగాలి పర్యటన చేపట్టారు.

విజయవాడ రూర ల్ మండలం బోడపాడు, జి.కొండూరు మండ లం వెలగలేరు, మైలవరం మండలం పుల్లూరు, కంచికచర్ల మండలం పరిటాల, ఏ.కొండూరు మండలం రామచంద్రాపురం తదితర పోలింగ్ కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి ఓటింగ్ సరళిని, భద్రతా ఏర్పాట్లను సమీక్షిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 992 పోలింగ్ కేంద్రాల్లో 5,200 మందికి పైగా ఎన్నికల సిబ్బంది, పోలీసు బందోబస్తు సమన్వయంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలతో పాటు మొత్తం 496 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీటీవీల ద్వారా జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం నిఘా ఉంచామని, దీనివల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలిం గ్ ప్రశాంతంగా ముగిసిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల నుంచి విశేష స్పందన లభించిందని, పట్టణాలు, ఇతర దూర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు సైతం తమ స్వగ్రామాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పిందన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీగా సీల్ చేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్దీత స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ఎన్నికల నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వర్తించిన ఎన్నికల సిబ్బందికి, పోలీసు అధికారులకు, మీడియా ప్రతినిధులకు, శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించిన ఓటర్లందరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.





పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సామగ్రి స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



రిసెప్షన్ కేంద్రంలో వసతులు, లేఅవుట్, భోజన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

డీకే బాలాజీ

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం: కృష్ణా జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో, పోలింగ్ విధులు నిర్వహించిన సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రితో రిసెప్షన్ కేంద్రాలకు చేరుకున్న అనంతరం వాటిని స్వీకరించి, భద్రపరిచేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది కేంద్రంలోకి ప్రవేశించే మార్గాలు, పోలింగ్ సామగ్రిని అప్పగించే విధానం, వాటిని స్వీకరించే కౌంటర్లు, సిబ్బంది విధుల నిర్వహణకు కేటాయించిన ప్రాంతాలు, సామగ్రిని భద్రపరిచే ప్రదేశాలు తదితర అంశాలను పరిశీలించారు.పోలింగ్ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా రిసెప్షన్ కేంద్రానికి చేరుకునేలా స్పష్టమైన లేఅవుట్ రూపొందించాలని, ప్రతి దశలోనూ క్రమబద్ధమైన విధానాన్ని అనుసరించాలని సూచించారు.

బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని సంబంధిత సిబ్బంది నుంచి జాగ్రత్తగా స్వీకరించి, నిర్దేశించిన విధానాల ప్రకారం రిజిస్టర్లలో నమోదు చేయాలని తెలిపారు. సామగ్రి స్వీకరణ, పరిశీలన, అప్పగింత ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, తగిన కౌంటర్లు, తాగునీరు, విద్యుత్, లైటింగ్ తదితర మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు.

రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన భోజన వసతులను కూడా జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. భోజనం పంపిణీకి తగిన సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేశారా లేదా, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో భోజనం అందించేలా ఏర్పాట్లు ఉన్నాయా అనే విషయాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అవసరమైన మేరకు అదనపు భోజన కౌంటర్లు ఏర్పాటు చేసి, రద్దీ లేకుండా, వేచి ఉండే పరిస్థితులు తలెత్తకుండా భోజన పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పోలింగ్ సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ఎన్నికల సామగ్రి స్వీకరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ ఏర్పాట్ల పర్యవేక్షణలో సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీవోలు, డీఎల్డీవోలు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల సామగ్రి స్వీకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

నాయనవారిపల్లిలో పోలింగ్ అక్రమాలపై ఆరోపణలు

ఏజెంట్లను బయటకు పంపించి ఓటింగ్ నిర్వహించారంటూ స్వతంత్ర అభ్యర్థి జి పార్వతమ్మ ఉల్లికల్లు రంగారెడ్డి ఆరోపణ





ప్రజాభూమి శింగనమల మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. పోలింగ్ ప్రక్రి యలో అక్రమాలు చోటుచేసుకున్నాయని స్వతం త్ర అభ్యర్థుల జి పార్వతమ్మ ఆరోపిం చాయి. వారి ఆరోపణల ప్రకారం. అభ్యర్థులకు చెందిన పోలింగ్ ఏజెంట్లను బలవంతంగా పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపించా రని పేర్కొన్నారు. అనంతరం వారి ఏజెంట్లు లేకుండానే పోలింగ్ కొనసాగించారని ఆరోపిం చారు. అంతేకాకుండా, ఇప్పటికే ఓటు హక్కు వినియోగించుకున్న కొందరు ఓటర్లతో మరో సారి ఓట్లు వేయించారని, ఏజెంట్లు అందు బాటులో లేని సమయంలో దొంగ ఓట్లు పోలయ్యాయని వారు ఆరోపిస్తున్నారు.ఈ పరిణా మాలపై ఎన్నికల నిర్వహణ తీరును ప్రశ్నిస్తూ అభ్యర్థుల వర్గాలు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. పోలింగ్ ఏజెంట్లను ఏ కారణంతో బయటకు పంపించారు? ఒకసారి ఓటు వేసిన వ్యక్తులతో మరోసారి ఓట్లు ఎలా వేయించారు ఏజెంట్లు లేకుండా పోలింగ్ కొనసాగించడానికి అనుమతి ఎలా ఇచ్చారు? అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ ఘటనపై ఎన్నికల అధికారులు తక్షణమే స్పందించి సంబంధిత పోలింగ్ కేంద్రంలోని సీసీటీవీ ఫుటేజీ, ఓటర్ల జాబితా, పోలింగ్ రికార్డులను పరిశీలించాలని బాధిత అభ్యర్థుల వర్గాలు కోరుతున్నాయి. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను వెలుగు లోకి తీసుకురావడంతో పాటు అక్రమాలు జరిగి నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజాస్వామ్య ఎన్నికల్లో ప్రతి ఓటు విలువైనదే. పో లింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ఎన్నికల యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

శుక్రవారం 6 నవంబర్ 2026

ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

- మండలవ్యాప్తంగా 81.93 శాతం పోలింగ్ నమోదు
- పోలీసు బందోబస్తు, వైద్య శిబిరాల ఏర్పాటు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని మండల ప్రత్యేక అధికారి ఈబీ విలియమ్స్ తెలిపారు. ఎన్నికల సిబ్బంది సమన్వయంతో మండలవ్యాప్తంగా 81.93 శాతం పోలింగ్ నమోదైందని, మొత్తం 50,516 మంది ఓటర్లకు గాను 41,429 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ పెట్టెలను పోలీసు భద్రత నడుమ నూజివీడులోని సారథి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన భద్రపరిచే గదికి తరలించి భద్రపరిచారు. ఎస్సై వి. సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని 63 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ టీనా, డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ నరేంద్రకృష్ణ ఆధ్వర్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఈబీ విలియమ్స్, తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్, ఎంపీడీవో అబ్దుల్ సలాం పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.





ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

- వి.ఆర్.పురం మండలంలో 74 శాతం పోలింగ్.. 20,318 మంది ఓటర్లకు గాను 15,065 మంది ఓటు హక్కు వినియోగం

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మండలంలోని 24 పోలింగ్ కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 20,318 మంది ఓటర్లకు గాను 15,065 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మండలంలో 74 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనడం కనిపించింది. ఎన్నికల నిర్వహణకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించడంతో పోలింగ్ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయింది. మొత్తంగా మండలంలోని 24 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం.

కొవ్వాడ వరద నీటితో అల్లాడుతున్న రైతులు.. గ్రామాలు



- వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- ప్రధాన రహదారులు జలమయం.. నిలిచిన రాకపోకలు
- పునరావాస కేంద్రాల ఏర్పాటు: తహసీల్దార్ లక్ష్మీ లావణ్య

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

కొవ్వాడ వరద నీటి ఉధృతితో తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గజ్జరం, అన్నదేవరపేట, పోచవరం, తాడిపూడి, తిరుగుడుమెట్ట గ్రామాల్లో వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. పలు ప్రధాన రహదారులు వరద నీటితో నిండిపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తిరుగుడుమెట్ట ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహించడంతో గ్రామంలోకి వెళ్లేందుకు సరైన మార్గం లేక ప్రజలు ట్రాక్టర్లపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాగోలపల్లి--తాడిపూడి గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అన్నదేవరపేటలోని జాన్‌పేట, ఇందిరమ్మపేట, అరుంధతీయపేట వీధుల్లోకి వరద నీరు చేరింది. పోచవరం పంచాయతీ పరిధిలోని రాగోలపల్లి ఎస్సీ కాలనీలో సుమారు ఎనిమిది ఇళ్లలోకి నీరు చేరడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరుగుడుమెట్ట గ్రామాన్ని వరద నీరు





చుట్టుముట్టి, ప్రధాన రహదారిని మూసివేసింది.

నిత్యావసరాల పంపిణీకి చర్యలు

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మీ లావణ్య తెలిపారు. గ్రామస్థులు పునరావాస కేంద్రాలకు రావడానికి ఆసక్తి చూపకపోయినా, ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అవసరమైన వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- మాకవరపాలెం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజాభూమి ప్రతినిధి -అనకాపల్లి

ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పోలీసు అధికారులు, సిబ్బంది చివరి నిమిషం వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. గురువారం మాకవరపాలెం మండలంలోని మాకవరపాలెం, జి.గంగవరం, భీమబోయినపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. పోలింగ్ ముగింపు సమయం అత్యంత కీలకమని, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని కేంద్రాల నుంచి సురక్షితంగా వెళ్లే వరకు పోలీసులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అనవసరంగా గుమిగూడే వ్యక్తులపై



నిఘా పెట్టి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే సమయంలో ఎస్కార్ట్ బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సెక్టార్ అధికారులు, ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ పర్యటనలో సీఐలు బాల సూర్యారావు, నాగేశ్వరరావు, సింహాద్రి నాయుడు, ఎస్సై దామోదర్ నాయుడు, సెక్టార్ అధికారులు, బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు.

ఎండ నుంచి రక్షణకు పోలింగ్ సిబ్బందికి టోపీలు పంపిణీ

- పరవాడ సీఐ భాస్కరరావు ప్రత్యేక చొరవ

ప్రజాభూమి ప్రతినిధి

అనకాపల్లి / పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పరవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు టోపీలు పంపిణీ చేశారు. ఎన్నికల బందోబస్తు, సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎండలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పోలీస్ శాఖ తరఫున టోపీలను అందజేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి అవసరమైన సహకారం అందించడంలో భాగంగా సీఐ భాస్కరరావు ఈ చొరవ తీసుకున్నారు.





రాయలసీమలో అల్లర్లకు ప్రధాన ముద్దాయి జగనే

- బ్యాలెట్ బాక్సులు బద్దలు కొట్టి ప్రెస్ అటెన్షన్ డ్రా చేసేందుకు జగన్ కుట్రలు
- సెలెక్షన్‌కు, ఎలక్షన్‌కు తేడా తెలియని వ్యక్తి జగన్
- ఓటర్లకు విచ్చలవిడి డబ్బు పంపిణీ, వైసీపీ రౌడీల దౌర్జన్యాలపై ఎస్ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు
- ఎమ్మెల్సీ వర్ల రామయ్య, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సాగించిన అరాచకాలు, హింసాత్మక ఘటనలు, విచ్చలవిడి డబ్బు పంపిణీపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు నేడు తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రాంతాల్లో వైసీపీ గుండాలు చేసిన అరాచకాలను గుర్తించి, ఎన్నికల సంఘానికి మొత్తం 19 ఫిర్యాదులు అందజేశారు. పోలింగ్ బూతుల్లోకి కర్రలు, పెట్రోల్ బాంబులతో చొరబడి భయాందోళనలు సృష్టించారు. ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ లతో కూడిన బృందం ఎస్ఈసీకి సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వైసీపీ రౌడీ మూకలు పెట్రో బాంబులు విసిరి టీడీపీ అభ్యర్థులను, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. వైసీపీ నేతల సృష్టించిన అల్లర్లు, దౌర్జన్యాలకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఎస్ఈసీకి సమర్పించారు. ఎన్నికల్లో వేళ విచ్చలవిడి డబ్బు పంపిణీ, ఎంపీటీసీ అభ్యర్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎన్నికల కమిషనర్ ను కలిసిన అనంతరం ఎమ్మెల్సీ వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న పరిషత్ ఎన్నికల్లో ఏదో ఒకటి చేసి పరువు కాపాడుకోవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆరాటం ప్రదర్శిస్తున్నారు. గతంలో 151 సీట్లు ఉన్నప్పుడు "వై నాట్ 175" అని విర్రవీగిన జగన్, అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాలకు పడిపోయి అహం దెబ్బతిన్నా ఇంకా తీరు మార్చుకోలేదు. మొన్నటి స్థానిక ఎన్నికల్లోనూ కేవలం ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలకే పరిమితమయ్యారు. ఇప్పుడు పరిషత్ ఎన్నికల్లో కూడా ఘోర పరాభవం తప్పదన్న భయంతోనే అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శించారు. నిన్న రాత్రి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లకు విచ్చలవిడిగా, నీళ్లలాగా డబ్బులు పంచారు. సాధారణంగా ఓటు వేస్తారన్న నమ్మకం ఉన్నవారికే డబ్బు ఇస్తుంటారు, కానీ వీళ్లు మాత్రం ఎక్కడా లేని విధంగా అందరికీ డబ్బు పంచిపెట్టారు. ఉన్నట్టుండి ఇంత భారీగా డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఈ అక్రమ ధన ప్రవాహం వెనుక మూలాలపై విచారణ జరగాలి. రాష్ట్రంలో మాకు ఇంకా ఓటు బ్యాంకు ఉందనే భ్రమ కల్పించేందుకే కోట్ల రూపాయలు వెదజల్లారు. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రాంతాల్లో అరాచకాలను గుర్తించి, ఎన్నికల సంఘానికి మొత్తం 19 ఫిర్యాదులు అందజేశాం. పోలింగ్ బూతుల్లోకి కర్రలు, పెట్రోల్ బాంబులతో చొరబడి భయాందోళనలు సృష్టించారు. అందరి ముందే బ్యాలెట్ బాక్సులను బయటకు తెచ్చి ధ్వంసం చేశారు. శ్రీకాకుళంతో పాటు పలుచోట్ల మా ఎంపీటీసీ అభ్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడి, చొక్కాలు పట్టి లాగారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగలేదని, అరాచకం జరిగిందని చూపేందుకు ఉద్దేశపూర్వకంగానే జగన్ ముఠా ఈ దాడులు సృష్టించింది. ఎవరు ఎక్కువ అల్లర్లు, దౌర్జన్యాలు చేస్తే వారికి భవిష్యత్తులో అసెంబ్లీ సీట్లు ఇస్తామన్నట్లు జగన్ పార్టీ నాయకులను ప్రోత్సహించడం సిగ్గుచేటు. జగన్ మోహన్ రెడ్డి ఈ ఎన్నికలను 'సెలెక్షన్' అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారు. ఆయనకు సెలెక్షన్ కి, ఎలక్షన్ కి తేడా తెలియకపోవడం విడ్డూరం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మంచి, సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రజలు, ఓటర్లు తమ అమూల్యమైన ఓటు వేసి వారిని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్నారు. ప్రజలు తమను తిరస్కరిస్తున్నారన్న అక్కసుతోనే జగన్ గంటల తరబడి ప్రెస్ మీట్లు పెట్టి అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారు. ఈ హింసాకాండ, అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచకాలన్నింటికీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డే ప్రధాన సూత్రధారి, ముద్దాయి. పంపిణీ చేసిన డబ్బంతా ఆయనే సమకూర్చగా, నేరాలకు పాల్పడాలని ఆయనే ప్రోత్సహించారు. ఈ కుట్రలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను, పోలీసు ఉన్నతాధికారులను గట్టిగా డిమాండ్ చేస్తున్నాం. రాబోయే పంచాయతీ, పురపాలక ఎన్నికల్లోనైనా పద్ధతి మార్చుకుని, చేతనైతే ప్రజాబలంతో ఎన్నికల బరిలో తేల్చుకోవాలని వర్ల రామయ్య హితవు పలికారు.

ప్రశాంతంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

- 61.24 శాతం పోలింగ్ నమోదు.. పటిష్ట బందోబస్తు మధ్య ముగిసిన పోలింగ్

ప్రజాభూమి, వేంపల్లె

గురువారం వేంపల్లె మండలంలో నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 17 స్థానాలను కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. మిగిలిన అలిరెడ్డిపల్లె ఎంపీటీసీ స్థానంతో పాటు వేంపల్లె జడ్పీటీసీ స్థానానికి పోలింగ్ నిర్వహించారు. వేంపల్లె జడ్పీటీసీ ఎన్నికల్లో 61.24 శాతం పోలింగ్ నమోదైంది. వేంపల్లె పట్టణ పరిధిలోని 30 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. జడ్పీటీసీ స్థానానికి వైసీపీ అభ్యర్థి బత్తల శివమ్మ, జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మిదేవితో



పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీపడ్డారు. అలిరెడ్డిపల్లె ఎంపీటీసీ స్థానానికి బీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ పర్యవేక్షణలో సీఐ నరసింహులు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, ఏపీసీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసి రెడ్డి, వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి బత్తల శివమ్మ, జనసేన పార్టీ అభ్యర్థి బెస్త లక్ష్మిదేవి, మాజీ జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగసుధతో పాటు పోలీసు, ఇతర ఎన్నికల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా ముగించారు. మొత్తంగా వేంపల్లె మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

కృష్ణా జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన జడ్పీటిసి, ఎంపిటిసి పోలింగ్ ప్రక్రియ

- విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం

కృష్ణా జిల్లాలో జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఏ చిన్న సంఘటనకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ముగిసింది. ప్రజలు తమ రాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికల విధుల్లో అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ, ఎన్నికల నియమావళిని పాటిస్తూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, మెరైన్ నుండి ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమైన వారికి కృష్ణా జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రానున్న కౌంటింగ్ ప్రక్రియను కూడా ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీస్ శాఖకు తమ సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ప్రజాభూమి

జనరల్ 14

శుక్రవారం 6 నవంబర్ 2026

దుగ్గిరాలలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే చింతమనేని

ప్రజాభూమి ప్రతినిధి పెదవేగి

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామ పరిధిలోని పోలింగ్ కేంద్రానికి (పీఎస్ నం: 71) చేరుకున్న ఆయన, సాధారణ ఓటరులా క్యూలైన్ నిబంధనలను పాటిస్తూ బ్యాలెట్ పద్ధతిలో తన ఓటును వేశారు.


ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి లభించిన అత్యంత పవిత్రమైన, శక్తివంతమైన హక్కు ఓటు మాత్రమేనని పేర్కొన్నారు. పల్లెల సమగ్రాభివృద్ధి, సమర్థవంతమైన స్థానిక నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి ఈ ఎన్నికలు అత్యంత కీలకమని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని విధాలా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. దెందులూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంత ఓటర్లందరూ పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి నిర్భయంగా, స్వతంత్రంగా నూటికి నూరు శాతం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సొంత గడ్డపై ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి చింతలపూడి



స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ లింగపాలెం మండలం, స్వగ్రామమైన ధర్మాజీగూడెంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని చాటిచెబుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

ప్రతీ ఒక్కరూ తమ ఓటుహక్కును

స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు



చాట్రాయి మండలం నరసింహాపురం, బూరుగుగూడెం, చాట్రాయి గ్రామాల్లో గురువారం సాయత్రం పోలింగుస్టేషన్లో ఓటింగు సరళిని పరిశీలించి, ఏర్పాట్లు ఎలా ఉన్నాయని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఓటర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఓటు హక్కు అనేది అన్యాయంపై న్యాయం గెలవడానికి ఒక శక్తివంతమైన సాధనమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలంతా ఉత్సాహంగా తరలివచ్చి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా యువత, ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును బాధ్యతగా ఉపయోగించుకోవాలని అన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఓటుహక్కు ద్వారానే ప్రజలు తమ భవిష్యత్తును మరియు మంచి పరిపాలనను నిర్దేశించుకోగలరని మంత్రి స్పష్టం చేశారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, ప్రతి ఓటరు స్వేచ్ఛగా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగు కేంద్రాలు వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పోలింగు కేంద్రాలు వద్ద క్రమశిక్షణ, శాంతిభద్రతలు కొనసాగించేలా సంబంధిత శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేయ్యాలని తెలిపారు. పోలింగు ముగిసే వరకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి, పోలింగు ప్రక్రియ శాంతియుతంగా పూర్తిచేయ్యాలని సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఎన్నికలు అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు

అయ్యప్ప అన్నసమారాధన మహోత్సవంలో ప్రత్యేక పూజలు

- పాల్గొన్న మేయర్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు నారా శేషు



ప్రజాభూమి ఏలూరు

నగరంలో గత 22 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న శ్రీ అయ్యప్ప అన్నసమారాధన మహోత్సవం భక్తుల సందడితో కొనసాగుతోంది.ఈ మహోత్సవంలో భాగంగా శ్రీ అయ్యప్ప స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఏలూరు నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడు,జనసేన నాయకులు నారా శేషు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు స్వామివారి ఆశీస్సులు ఏలూరు నగర ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని,ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.గత 22 సంవత్సరాలుగా నిరంతరాయంగా అయ్యప్ప అన్నసమారాధన మహోత్సవాన్ని నిర్వహిస్తూ భక్తులకు సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రతిరోజూ వెయ్యి మందికి పైగా అయ్యప్ప స్వాములకు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదం అందిస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న మహోత్సవ కమిటీ సభ్యులను మేయర్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు నారా శేషు ప్రత్యేకంగా అభినందించారు.భక్తి, సేవాభావంతో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనసాగించడం ప్రశంసనీయమని అన్నారు.

రామసింగవరంలో ఉద్రిక్తత

- వైసీపీ శ్రేణులకు అండగా హుటాహుటిన చేరుకున్న కొఠారు అబ్బయ్య చౌదరి

ప్రజాభూమి దెందులూరు



పెదవేగి మండలం రామసింగవరం గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా దొంగ ఓట్లు వేస్తున్నారనే సమాచారం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగే అవకాశం ఉందనే ఆందోళనల నేపథ్యంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలకు అండగా నిలిచి,ఎలాంటి బెదిరింపులకు భయపడకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని సూచించారు.గ్రామంలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను తనిఖీ చేసిన 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర రావు

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగేలా పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఏలూరు 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర రావు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడకూడదని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు.

ఓటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

ప్రజాభూమి ప్రతినిధి పెదపాడు



ఏలూరు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, జిల్లా లోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా సత్రంపాడు, వట్లూరు, అప్పనవీడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న పోలింగ్ విధానాన్ని, భద్రతా ఏర్పాట్లను, సిబ్బంది అప్రమత్తతను సమీక్షించారు. జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో, సమన్వయంతో విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

తుఫాన్ ప్రభావంతోలో లెవెల్ బ్రిడ్జి పక్కన గండి

- నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాభూమి కుకునూరు



కుక్కునూరు దాచారం మధ్య గుండేటి వాగుపై నిర్మించిన లో లెవెల్ బ్రిడ్జ్ పక్కనే గండి పడటంతో రాకపోకల నిలిచిపోయాయి. ము రుసు తుఫాన్ ప్రభావంతో గుండేటివాగు పొంగిపొర్లడంతో కుక్కునూరు- దాచారం వాగుపై నిర్మించిన లో లెవెల్ బ్రిడ్జ్ ఆనుకొని కట్టిన సైడ్ కాంక్రీట్ వాల్స్ కొట్టివేయడం వలన రోడ్ కు గండిపడి నేటికీ రాకపోకలు నిలిచిపోయాయి. దీనితో మండల కేంద్రానికి అవతల ఉన్న దాచారం, గొమ్ముగూడెం, సీతారాంపురం, బెస్తగూడెం, ఉప్పరమద్దిగట్ల పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి ఇప్పటికైనా అధికారులు మేల్కొని వెంటనే ఈ గండిని మట్టితో పూడ్చివేసి రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇది ఎలా ఉండగా ఈ మధ్యకాలంలోనే ఈ లో లెవెల్ బ్రిడ్జ్ కు అటుపక్క ఇటుపక్క సైడ్ కాంక్రీట్ వాల్సు నిర్మించారు క్వాలిటీ లోపం వలన దేనివల్ల పూర్తిగా ఒకవైపు కాంక్రీట్ వాల్స్ లెగిసిపోవడంతో గండిపడి పూర్తిగా రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ గండీని పూడ్చి మరమ్మత్తులు చేపట్టాలని రాకపోకలు నిలిచిపోయిన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

ప్రజా భూమి, ప్రత్తిపాడు



ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా తన స్వగ్రామమైన పెదశంకర్లపూడిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గురువారం ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ రాజా ఓటు వేశారు. అనంతరం పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా తీసుకున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



భారీ వర్షాలతో మునిగిపోయిన బాధిత ఏవిఎస్ఎన్ కాలనీ ప్రజలకు

- ఆహార పొట్లాల పంపిణీ

ప్రజా భూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లులో నిన్న కురిసిన భారీ వర్షాలతో మునిగిపోయిన ఏవిఎస్ఎన్ కాలనీలోని 200 మందికి ప్రజలకు ఆహార పొట్లాలు పంపిణీ చేయడం అయింది. ఈ కార్యక్రమంలో చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ చవాకుల సూర్య నరేష్ బాబు,34 వార్డు టిడిపి కన్వీనర్ సలాది బాబులు నాయుడు, చోడవరపు ఉమామహేశ్వరావు (బుజ్జి)గ, అడ్డాల మల్లి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- 65.50 శాతం పోలింగ్ నమోదు.
- నాలుగు మండలాల్లో 2.52 లక్షల మంది ఓటర్లు, 1.65 లక్షల మంది ఓటు హక్కు వినియోగం.
- అత్రేయపురంలో అత్యధికం, కొత్తపేటలో అత్యల్పం



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

కొత్తపేట అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి 65.50 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ సమయం ముగిసే సమయానికి మొత్తం 2,52,899 మంది ఓటర్లకు గాను 1,65,652 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే.. ఆలమూరు మండలంలో 60,009 మంది ఓటర్లకు గాను 41,285 మంది (68.80 శాతం), ఆత్రేయపురం మండలంలో 54,687 మందికి గాను 37,694 మంది (68.93 శాతం) ఓటు వేశారు. రావులపాలెం మండలంలో 73,126 మందికి గాను 45,996 మంది (62.90 శాతం), కొత్తపేట మండలంలో 65,077 మందికి గాను 40,677 మంది (62.51 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఆత్రేయపురం మండలంలో 68.93 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా కొత్తపేట మండలంలో 62.51 శాతం నమోదైంది. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కొత్తపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుండటంతో జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలనుంది.

ప్రశాంతంగా జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు

- ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి నిమ్మల

ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, ఎలమంచిలి మండల ప్రాంతాల్లో జడ్పిటిసి, ఎంపిటిసి స్థానిక ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఫ్యామిలీ అగర్తి పాలెం లో , , మేడిది ఉషారాణి జాన్ రాజు అగర్తి పాలెం లో , కొడవటి నాగ లక్ష్మి వరబాబు యలమంచిలి లో , ఎంపీపి అభ్యర్థులు.. అంగర వీరభద్ర కుమార్ కాపవరం లో ,పీతల శ్రీనివాస్ పెనుమర్రు లో ను ,తాళ్ల నాగరాజు మేడపాడులో, ఓటు హక్కు వినియోగించుకున్నారు.పాలకొల్లు, యలమంచిలి మండలంలో పోలింగ్ శాతం..70 వరకు జరిగినట్లు సమాచారం. కాగా ఓ పార్టీ ఓటుకూ రు. 1500, మరో పార్టీ ఓటుకు రూ. 500 చొప్పున సజరాణాలు పంచినట్లు ప్రచారం సాగుతోంది. ఎలమంచిలిలో ఓటు వేయడానికి వెళ్తూ ఒక వ్యక్తి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిసింది.

